

దగా!

(నరసరావుపేట, ఆంధ్రజ్యోతి)

- జిల్లాలో పెరిగిన కూరగాయల సాగు
- రైతు బజార్లు లేక నష్టపోతున్న రైతులు
- దళారులు చెప్పిందే రేటు..

రైతులు, వినియోగదారుల ప్రయోజనాలకు పెద్దపీట వేయాల్సిన మార్కెటింగ్ శాఖ ఆ బాధ్యతల నుంచి తప్పుకుంది. జిల్లాలో కూరగాయలు పండించే రైతులు, వినియోగదారులు దళారీల చేతిలో దోపిడీకి గురవతున్నా.. చోద్యం చూస్తోంది. రైతు బజార్ల ఏర్పాటులో మీనమేషాలు లెక్కిస్తోంది. జిల్లాలో చిలకలూరిపేట మినహా మునిసిపాలిటీలు, నగర పంచాయతీల్లో రైతు బజార్లు నిర్వహిస్తున్న దాఖలాలు లేవు. నాడు తెలుగుదేశం ప్రభుత్వ హయాంలో రైతు బజార్ల నిర్వహణకు పెద్దపీట వేశారు. నేడు ఆ పరిస్థితి కానరావడం లేదు. సత్తెనపల్లిలో రైతు బజారు ఉన్నా.. రెండు మూడు షాపులు మాత్రమే నిర్వహిస్తున్నారు. ఇవి కూడా వ్యాపారుల చేతుల్లోనే ఉన్నాయి. జిల్లా కేంద్రం నరసరావుపేటలో రూ.10 లక్షల వ్యయంతో మునిసిపల్ నిధులతో షెడ్లు నిర్మించి.. రైతు బజారు ఏర్పాటు చేశారు. పోలీసు స్టేషన్ పక్కనే ఉన్న ఈ రైతు బజారు షెడ్ రేకులు అపహరించుకుపోవడం గమనార్హం.

పెరిగిన సాగు విస్తీర్ణం.. దళారుల దగా

జిల్లాలో కూరగాయల సాగు గణనీయంగా పెరిగింది. పత్తి, మిరప పంటల సాగుతో నష్టాలు చవిచూస్తున్న రైతులు.. ప్రత్యామ్నాయంగా కూరగాయల సాగు చేపడుతున్నారు. పండించిన కూరగాయలు నరసరావుపేట, చిలకలూరిపేట తదితర పట్టణాల్లోని హోల్‌సేల్ మార్కెట్లకు తీసుకొస్తున్నారు. ఏరోజుకారోజు పంట ఉత్పత్తులు విక్రయించాల్సి ఉండటంతో దళారీలు సరైన ధర ఇవ్వక రైతులను దోచుకుంటున్నారు. ఇక కాటా వేసే సమయంలో బస్తాకు ఒకటి నుంచి రెండు కిలోలు తరుగు తీస్తున్నారు. అదేమని అడిగే పరిస్థితి లేదని రైతులు వాపోతున్నారు.

హోల్ సేల్ మార్కెట్లపై.. మార్కెటింగ్ శాఖ పర్యవేక్షణ లేదు. ఇక్కడ ప్రతి రోజు కూరగాయల ధరలను ప్రకటించడం లేదు. రైతుల నుంచి కొనుగోలు చేసిన కూరగాయలు మార్కెట్‌లో రెండు నుంచి మూడు రెట్లు అధిక ధరకు వినియోగదారులకు విక్రయిస్తున్నారు. కూరగాయ వ్యాపారుల దందాతో వినియోగదారులపై ఆర్థిక భారం పడుతోంది.



రేకులు అపహరించబడిన నరసరావుపేటలోని రైతు బజారు

బిల్లు.. జేబుకు చిల్లు

(నరసరావుపేట, ఆంధ్రజ్యోతి)

- మళ్లీ మొదటికి 'పల్లె పండుగ' బిల్లుల చెల్లింపులు
- ఉమ్మడి జిల్లాల్లో రూ.78 కోట్ల బకాయిలు
- ఎనిమిది నెలలుగా తప్పని ఎదురు చూపులు



'పల్లె పండుగ' బిల్లుల చెల్లింపు విధానం మళ్లీ మొదటికొచ్చింది. ఉపాధి హామీ పథకం నిధులతో పల్లెల్లో పెద్ద ఎత్తున ప్రగతి పనులు చేపట్టిన వారి జేబులకు చిల్లు పడేలా కనిపిస్తోంది. ప్రతి గురువారం చెల్లింపులు చేపడతామన్న ప్రభుత్వ హామీ రెండు వారాలకే పరిమితమైంది. పనులు చేస్తే వెంటనే సొమ్ములు వస్తాయని కూటమి నేతలు అప్పులు చేసి సీసీ రోడ్లు, మురుగు కాల్వలు, పాఠశాలల ప్రహరీల నిర్మాణం వంటి పనులను పల్లెల్లో పెద్ద ఎత్తున చేశారు. పనులు పూర్తయ్యి 8 నెలలు గడుస్తున్నాయి. పల్నాడు, బాపట్ల, గుంటూరు జిల్లాల్లో సుమారు రూ.78 కోట్ల విలువైన బిల్లుల కోసం ఎదురు చూపులు తప్పడం లేదు. బిల్లులు ఇప్పించాలని కొన్ని చోట్ల ఎమ్మెల్యేలపై నేతలు ఒత్తిడి తెస్తున్నారు. ఈ పథకం ప్రారంభంలో మొదటి రెండు వారాలు బిల్లుల చెల్లింపులు సక్రమంగా జరిగాయి. అనంతరం పల్నాడు జిల్లాలో రూ.47 కోట్లు, బాపట్ల జిల్లాలో రూ.23 కోట్లు, గుంటూరు జిల్లాలో రూ.8 కోట్లు బిల్లుల చెల్లింపుల్లో జాప్యం జరుగుతుండటంతో పనులు చేపట్టిన వారిలో ఆందోళన వ్యక్తమవుతోంది. బిల్లులు చెల్లించి తమను అప్పుల ఊబీ నుంచి బయట పడేయాలని కోరుతున్నారు.

మళ్లీ మొదటికి..

గత టీడీపీ ప్రభుత్వ హయాంలో పార్టీ ద్వితీయ శ్రేణి నేతలు ఉపాధి హామీ పథకం కింద పనులు చేసి, బిల్లులు రాక చేతులు కాల్చుకున్నారు. ప్రస్తుతం అందులో చాలా మంది పల్లె పండుగ పథకం పనులు చేపట్టారు. పాత బిల్లుల మాట ఎలా ఉన్నా.. కొత్త బిల్లులు కూడా నిలిచిపోవడంతో.. పరిస్థితి మళ్లీ మొదటికొచ్చిందని వారు భావిస్తున్నారు. పనులకు డబ్బులు ఖర్చు పెట్టి అప్పులు పాలయ్యామని, వడ్డీలు కట్టలేక పోతున్నామని పార్టీ నేతలు ఆవేదన వక్తం చేస్తున్నారు.



కరపత్రాలను ఆవిష్కరిస్తున్న కలెక్టర్ పి.అరుణ్‌బాబు, అధికారులు

మట్టి వినాయక ప్రతిమలనే పూజిద్దాం

కలెక్టర్ పి.అరుణ్‌బాబు

నరసరావుపేట టౌన్, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): వినాయక చవితి సందర్భంగా మట్టి వినాయక ప్రతిమలను పూజించాలని, పర్యావరణాన్ని పరిరక్షించాలని కలెక్టర్ పి.అరుణ్‌బాబు పిలుపునిచ్చారు. సోమవారం కలెక్టరేట్‌లో ఆంధ్రప్రదేశ్ కాలుష్య నియంత్రణ మండలి ఆధ్వర్యంలో పర్యావరణ అనుకూల వినాయక చవితి అవగాహన కార్యక్రమం కరపత్రాలను ఆయన ఆవిష్కరించారు. సహజ రంగులు వేసిన మట్టి ప్రతిమలతో పర్యావరణ అనుకూల వినాయక చవితిని జరుపుకుందామని నినాదమిచ్చారు. ఈ సందర్భంగా కలెక్టర్ పి.అరుణ్‌బాబు మాట్లాడుతూ.. పౌరులు పర్యావరణాన్ని రక్షించేందుకు సహకరించాలని, ప్లాస్టర్ ఆఫ్ పారిస్ విగ్రహాలు నీటి వనరులను కలుషితం చేస్తూ, జీవవైవిధ్యానికి హాని కలిగిస్తాయన్నారు. ఈ సంవత్సరం గణేష్ నవరాత్రుల్లో ప్రజలందరూ మట్టి విగ్రహాలే వినియోగించాలని, హరిత భవిష్యత్తు కోసం భాగస్వాములు కావాలని కోరారు. జిల్లా రెవెన్యూ ఆఫీసర్ మురళి, పర్యావరణ ఇంజినీరు ఎండీ నజీనా బేగం, ఇతర జిల్లా అధికారులు పాల్గొన్నారు.

మండపాల అనుమతులు ఉచితం : ఎస్పీ శ్రీనివాసరావు



నరసరావుపేట లీగల్, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): గణేష్ ఉత్సవ మండపాల ఏర్పాటుకు అనుమతులు పూర్తిగా ఉచితమని ఎస్పీ కంచి శ్రీనివాసరావు తెలిపారు. సోమవారం జిల్లా పోలీసు కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ.. అనుమతులు సింగిల్ విండో పద్ధతిలో ఉచితంగా ఇస్తున్నట్లు తెలిపారు. గణేష్ ఉత్సవ మండపాల ఏర్పాటు, ఊరేగింపులు, నిమజ్జనం కోసం అనుమతులు సులభంగా పొందవచ్చన్నారు. దరఖాస్తు విధానాన్ని వివరించారు. పోలీస్ శాఖ సూచనలు పాటించి, పండగను ప్రశాంత వాతావరణంలో చేసుకోవాలని ఎస్పీ సూచించారు. సిబ్బంది ఎవరైనా అనుమతులకు డబ్బులు అడిగితే తన దృష్టికి తేవాలన్నారు.

ఇదేం పంచాయితీ!

సందట్లో సడేమియా!

ఎప్పుడైతే ఇంటి పన్ను పెంచమని ప్రభుత్వం చెప్పిందో పల్నాడు, గుంటూరు, బాపట్ల జిల్లాల్లోని కొందరు పంచాయతీ కార్యదర్శులు మెదడుకు పదును పెట్టారు. 2000 నుంచి ఆస్తి పన్ను పెంపు లేదు కాబట్టి తాజా మార్కెట్ విలువ ప్రకారం పన్ను పెంచేందుకు సిద్ధం అయ్యారు. సబ్-రిజిస్ట్రార్ కార్యాలయాలను సంప్రదించి.. పలు దఫాలు పెరిగిన మార్కెట్ విలువలను ఆధారంగా ఇంటి పన్ను భారీగా పెంచారు. ఉదహరణకు గతంలో రూ.300 మాత్రమే ఉన్న ఇంటి పన్ను తాజా మార్కెట్ రేటు ప్రకారం రూ.1,300 వరకు వెళ్లింది. ఈ విధంగా పన్ను పెంచుతున్నారన్న సమాచారం బయటకు పొక్కడంతో తీవ్ర దుమారం రేగింది.



ఒక పథకం ప్రారంభించే ముందు.. దానిని ప్రజల్లోకి తీసుకెళ్లే ఉద్యోగులకు సరైన శిక్షణ ఇవ్వకుంటే ఎటువంటి ప్రతికూల పరిస్థితులు ఎదురవుతాయో.. కూటమి ప్రభుత్వం శ్రీకారం చుట్టిన 'స్వర్ణ పంచాయతీ' కార్యక్రమం ఒక మంచి ఉదాహరణ. జీవోలోని అసలు విషయం అర్థం కాక.. పంచాయతీ కార్యదర్శులు ఎడాపెడా ఆస్తి పన్ను పెంపునకు సిద్ధం కావడంతో.. గ్రామీణ ప్రజల్లో ఒక దుష్ప్రచారానికి, ఆందోళనకు కారణమైంది. దీంతో ఉన్నతాధికారులు అప్రమత్తమై.. దిద్దుబాటు చర్యలు చేపట్టారు. పన్ను పెంపు జరిగిన చోట అసెస్మెంట్ల ఆన్‌లైన్ ప్రక్రియకు బ్రేకులు వేశారు.

- 'స్వర్ణ పంచాయతీ' కార్యక్రమంలో పన్ను పోటు
- శిక్షణ లేక.. జీఓలు అర్థం కాని కార్యదర్శులు
- ఎడా పెడా పన్ను పెంచేసిన వైనం
- ప్రభుత్వ ఆదేశాలతో మళ్లీ అసెస్మెంట్‌ల సమీక్ష
- పెంపు 5 శాతమే ఉండే విధంగా ఆదేశాలు

నరసరావుపేట, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): గతంలో కేవలం రూ. 250 మాత్రమే ఉన్న ఇంటి పన్ను ఒకేసారి రూ.1000 అయ్యింది. అసాధారణ పన్ను పోటుతో గ్రామీణ ప్రజలు బేంబేలెత్తి పోయారు. రాష్ట్ర ప్రభుత్వం ఒక మంచి ఉద్దేశంతో ప్రవేశ పెట్టిన స్వర్ణ పంచాయతీ కార్యక్రమంలో ఈ పరిణామం చోటు చేసుకుంది. ప్రభుత్వం చెప్పిన సంగతిని పంచాయతీ కార్యదర్శులు సరిగా అర్థం చేసుకోకపోవడంతో ఉమ్మడి గుంటూరు జిల్లాలోని 1,172 గ్రామ పంచాయతీల్లో ఆందోళన నెలకొంది. అయితే ఉన్నతాధికారులు అప్రమత్తం కావడంతో.. దిద్దుబాటు చర్యలు చేపడుతున్నారు.

ముందుగానే భారీ ప్రచారం?

స్వర్ణ పంచాయతీ కార్యక్రమం.. కార్యాలయాలకే పరిమితమైంది. కానీ, పన్ను బాగా పెంచేశారన్న ప్రచారం భారీగా జరిగింది. ప్రజలపై భారం మోపుతున్నారంటూ వైసీపీ దుష్ప్రచారం ప్రారంభించింది. ప్రజలకు ఇంటి పన్ను పెంపు నోటీసులు ఇవ్వకుండానే ఈ భారీ ప్రచారం పట్ల ప్రభుత్వ వర్గాలు కూడా ఆశ్చర్య పడుతున్నాయి. క్షేత్రస్థాయి సిబ్బంది కొందరు వైసీపీకి లబ్ధి చేకూర్చేందుకు ఈ ప్రచారం అమల్లోకి తెచ్చినట్లు తెలుస్తోంది.

అసలు ఉద్దేశం ఇదీ..

ఈ ఏడాది జనవరిలో స్వర్ణ పంచాయతీ కార్యక్రమానికి రాష్ట్ర ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. ఇంటి పన్ను ఆన్‌లైన్‌లో చెల్లించే అవకాశం కల్పించింది. అది కూడా నేరుగా పంచాయతీ జనరల్ ఫండ్‌లో జమ కావడంతో.. ఎప్పుడు కావాలంటే అప్పుడు నగదు డ్రాచేసుకొని వినియోగించుకునే వీలు కల్పించింది. అందులో భాగంగా ప్రతి ఇంటికి మళ్లీ కొలతలు తీసుకొని జీవోకు లోబడి పన్ను పెంపు జరగాలని పంచాయతీ కార్యదర్శులను ప్రభుత్వం (మిగతా 8వ పేజీలో)

ప్రభుత్వాసుపత్రుల్లో.. ఆన్‌లైన్ ఓపీ

- ముందుగా ఏరియా వైద్యశాలల్లో..
- భవిష్యత్‌లో ప్రిస్క్రిప్షన్, ల్యాబ్ రిపోర్టులు ఆన్‌లైన్‌లో

రూ. 15 వేలు దాటిన మిర్చి ధర

- మరింత పెరిగే అవకాశాలు



తల్లిదండ్రుల ఆశా జ్యోతి

- చదువుకుంటూ, కూలి పనులకెళ్తూనే డీఎస్సీ కొలువు

శిల్పారామం.. కళాశోభితం

- రాష్ట్ర స్థాయి చేనేత ఉత్పత్తుల మేళా.. 'షీ' ● రాష్ట్రం నలుమూలల నుంచి భారీగా చేనేత ఉత్పత్తులు
- యూపీ, జార్ఖండ్, కశ్మీర్, పశ్చిమ బెంగాల్, తమిళనాడు నుంచి స్టాల్స్

8

వ్యవసాయ శాఖ దాడులు

- రూ.3.68 కోట్ల పురుగు మందుల అమ్మకాల నిలిపివేత

6



నిర్మాణం పూర్తవుతున్న మున్సిపల్ కార్యాలయం



తుది దశకు పిడుగురాళ్ల మున్సిపల్ కార్యాలయం

అప్పుడు వదిలేశారు.. ఇప్పుడు పూర్తి చేస్తున్నారు!

పిడుగురాళ్ల, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): పిడుగురాళ్ల పురపాలక సంఘ కార్యాలయ భవన నిర్మాణ పనులు శరవేగంగా పూర్తవుతున్నాయి. 1942లో పంచాయతీగా ఏర్పడిన పిడుగురాళ్ల 2005లో నగర పంచాయతీగా, 2014లో గ్రేడ్-2 మున్సిపాలిటీగా ఏర్పడింది. ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు 2014-19 మధ్యలో పిడుగురాళ్ల పట్టణానికి పెద్ద ఎత్తున నిధులు రాబట్టారు. పంచాయతీగా ఏర్పాటైన నాటి కార్యాలయంలో మునిసిపాలిటీ కార్యకలాపాలు కొనసాగించడం అధికారులకు, ప్రజలకు అసౌకర్యంగా ఉండడంతో.. 2018-19లో పిడుగురాళ్లలో పురపాలక సంఘం భవన నిర్మాణానికి రూ.2 కోట్ల నిధులతో యరపతినేని పంపుహౌస్ వద్ద శంకుస్థాపన చేశారు. ఆ తర్వాత ఏర్పడిన వైసీపీ ప్రభుత్వంలో తహసీల్దార్ కార్యాలయం పక్కనే ఉన్న ఆర్అండ్‌బీ కార్యాలయాన్ని అక్కడి నుంచి తరలించి.. మున్సిపల్ కార్యాలయ భవనానికి ఆ స్థలం కేటాయించారు. టీడీపీ హయాంలో మంజూరైన నిధులను భవన నిర్మాణానికి కేటాయించారు. ఎన్నికలకు రెండేళ్ల ముందు పనులు ప్రారంభించినా.. ఎన్నికల సమయానికి నిర్మాణ పనులు అసంపూర్తిగా ఉన్నా.. అప్పటి నేతలు హడావుడిగా కార్యాలయాన్ని ప్రారంభోత్సవం చేశారు. భవన నిర్మాణానికి కేవలం రూ.40 లక్షలు మాత్రమే కేటాయించారు. ఆ నిధులు సరిపోకపోవడంతో ఎమ్మెల్యే శ్రీనివాసరావు మళ్లీ రూ.1.20 కోట్లు మంజూరు చేయించారు. ఈ నిధులతో సీసీ రోడ్డు, చైర్‌పర్సన్ చాంబర్, కమిషనర్ గది, విశాలవంతమైన కౌన్సిల్ హాలు, శాఖల వారీగా 9 గదులను నిర్మించారు. ఈ పనులన్నీ మరో 20 రోజుల్లో పూర్తికానున్నాయి. అక్టోబరు 2న మున్సిపల్ కార్యాలయ నూతన భవనం ప్రారంభోత్సవం చేసేందుకు అధికారులు సిద్ధం చేస్తున్నారు.

గత ప్రభుత్వంలో రుణ పాట్లు..!

పిడుగురాళ్ల పట్టణ ప్రస్తుత జనాభా లక్షకు పైనే ఉంది. వైసీపీ ప్రభుత్వ హయాంలో మున్సిపల్ కార్యాలయ భవనాన్ని పూర్తిచేసేందుకు నిధులు సరిపోవన్న ఉద్దేశంతో.. అప్పటి నేతలు నిర్మాణంలో ఉన్న భవనాన్ని, కొంత స్థలాన్ని బ్యాంకులో తాకట్టు పెట్టేందుకు ప్రతిపాదనలు సిద్ధం చేశారు. రూ. 8 కోట్లు ప్రపంచ బ్యాంక్ నుంచి రుణం పొందేందుకు ప్రయత్నించినా బ్యాంకు ఉన్నతాధికారులు రుణ ఫైల్‌ను తిప్పి పంపారు. దీంతో భవన నిర్మాణ పనులు ఎక్కడికక్కడే నిలిచిపోయాయి.

విశాలంగా మున్సిపల్ కౌన్సిల్ సమావేశం హాలు



పౌష్టికాహారానికి పెద్ద పీట!

ఐసీడీఎస్‌కు ప్రభుత్వం ఏడు లక్ష్యాలు

సత్తెనపల్లి, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): అంగన్‌వాడీ కేంద్రాల్లో గర్భిణులు, బాలింతలు, చిన్నపిల్లలకు పౌష్టికాహారం అందించడానికి ప్రభుత్వం ప్రత్యేక ఉత్తర్వులు జారీ చేసింది. స్వర్ణాంధ్ర-2047లో భాగంగా ఐసీడీఎస్‌కు ఏడు కీ పర్ఫార్మెన్స్ ఇండికేటర్స్ పెట్టడం ద్వారా 2025 - 26 సంవత్సరానికి కీలక పని తీరు, లక్ష్యాలను నిర్దేశించింది. గర్భిణులు, బాలింతలతో పాటు వయస్సుకు దగ్గ బరువు, ఎత్తు లేని పిల్లలకు నూరు శాతం పౌష్టికాహారం అందించాలని ఆదేశించింది. పల్నాడు జిల్లాలో తొమ్మిది ఐసీడీఎస్ ప్రాజెక్టులున్నాయి. ఈ ప్రాజెక్టుల పరిధిలో గర్భిణులు 9,993, బాలింతలు 11,104, జీరో నుంచి ఆరు సంవత్సరాల లోపు పిల్లలు 1,21,470 మంది వరకు ఉన్నారు. ఆరు నెలల లోపు పిల్లలు 11,148, ఆరు నెలల నుంచి సంవత్సరం లోపు పిల్లలు 11,955, సంవత్సరం నుంచి మూడేళ్ల లోపు పిల్లలు 49,078 మంది, మూడు నుంచి ఆరేళ్ల లోపు పిల్లలు 49,289 మంది ఉన్నారు. వీరికి ప్రభుత్వం పౌష్టికాహారాన్ని అందిస్తోంది.

లక్ష్యాలు ఇవీ..

పల్నాడు జిల్లాలోని ఐసీడీఎస్ ప్రాజెక్టుల పరిధిలో జీరో నుంచి ఐదేళ్లలోపు వయస్సుకు దగ్గ ఎత్తు లేని పిల్లలు 68,944 మంది, ఎత్తుకు తగ్గ బరువు లేని వారు 1,212 మంది, వయస్సుకు తగ్గ బరువు లేని వారు 1,090 మంది, ఓవర్ వెయిట్ ఉన్న పిల్లలు 1,494 మంది ఉన్నట్లు అధికారులు గుర్తించారు.



పౌష్టికాహారం అందించడం ద్వారా ఈ ఏడాది వయస్సుకు తగ్గ బరువు, ఎత్తు తక్కువగా ఉన్న పిల్లలను రెండు శాతం చొప్పున తగ్గించాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టింది. గర్భిణులకు, బాలింతలకు, ఏడు నెలల నుంచి మూడేళ్ల లోపు పిల్లలకు వంద శాతం టీహెచ్‌ఆర్ ఇవ్వాలి. ప్రీ స్కూల్ పిల్లలు నెలలో కనీసం 21 రోజులు అంగన్‌వాడీ కేంద్రాలకు హాజరవ్వాలి. బాల్య వివాహాలను నిరోధించాలి.

మల్లేశ్వరుని దర్శించిన జిల్లా జడ్జి దంపతులు



గుంటూరు జిల్లా జడ్జి జస్టిస్ బీ సాయికళ్యాణచక్రవర్తి దంపతులకు జ్ఞాపిక అందజేస్తున్న ఆలయ ఉప కమిషనర్ గోగినేని లీలా కుమార్

పెదకాకాని, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): పెదకాకానిలోని శ్రీ గంగా భ్రమరాంబ సమేత మల్లేశ్వర స్వామి దేవస్థానాన్ని, గుంటూరు జిల్లా జడ్జి జస్టిస్ బీ సాయి కళ్యాణ చక్రవర్తి దంపతులు సోమవారం దర్శించారు. ఆలయ మర్యాదలతో జస్టిస్ దంపతులకు అధికారులు ఘన స్వాగతం పలికారు. ఆలయంలో మల్లేశ్వర స్వామి వారికి, భ్రమరాంబ అమ్మవార్లకు ప్రత్యేక పూజలు జరిపించారు. జస్టిస్ దంపతులను శేష వస్త్రముతో సత్కరించి స్వామివారి తీర్థప్రసాదాలు ఆలయ ఉప కమిషనర్ లీలా కుమార్ అందజేశారు.

మాట నిలబెట్టుకున్న లోకేశ్ : జీవీ

వినుకొండ, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి) : మంత్రి లోకేశ్ రాష్ట్రంలోని నిరుద్యోగ యువతకు ఇచ్చిన మాట నిలబెట్టుకున్నారని ప్రభుత్వ చీఫ్‌విప్, వినుకొండ ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. కూటమి ప్ర భుత్వం వచ్చిన తర్వాత ముఖ్యమంత్రి చంద్రబాబు ఈ ఫైల్ మీదనే తొలి సంతకం పెట్టగా, తదనంతర కసరత్తులు పూర్తి చేసి పగడ్బందీగా, పారదర్శకంగా భారీ డీఎస్సీని నిర్వహించడం, వారాల వ్యవధిలో ఫలితాలు ప్రకటించడం చారిత్రక సం దర్భమన్నారు. విద్యారంగాన్ని బలోపేతం చేయడానికి, పాఠశాలల్లో ఉపాధ్యాయుల కొరతను తీర్చడానికి ఇదొక మైలురాయిగా నిలుస్తుందన్నారు. "ఇది కేవలం ఉద్యో గాల భర్తీ కాదు, వేలాది కుటుంబాల భవిష్యత్తు నిర్మాణం" అని ఆయన అన్నారు. యువతకు ఉద్యోగాలు ఇవ్వడంపై కడుపుమంటతో రగిలిపోయిన వైసీపీ అధ్యక్షుడు జగన్ డీఎస్సీకి వ్యతిరేకంగా 24కేసులు వేయించినా అన్నీ అధిగమించి ప్రక్రియ పూర్తిచేసిన ఘనత పూర్తిగా మంత్రి లోకేశ్‌కే చెందుతుందన్నారు. ఇకపై ఏటా డీఎస్సీ నిర్వహిస్తామని హామీలో నిరుద్యోగ వర్గాలకు మరింత తీపి కబురు చెప్పినందుకు వ్యక్తిగత ధన్యవాదాలు తెలియజేస్తున్నానన్నారు. రాష్ట్రంలో అత్యధిక డీఎస్సీలు నిర్వహించిన ఘనత కూడా తెలుగుదేశం పార్టీ ప్రభుత్వానికే దక్కుతుందన్నారు. దీనికి పూర్తి విరుద్ధమైన రీతిలో పాలన సాగించిన జగన్ రెడ్డి అయిదేళ్ల వైసీపీ ప్రభుత్వం లో ఒక్క టీచర్ పోస్ట్ కూడా భర్తీ చేయకుండా పాఠశాల విద్యను నిర్వీర్యం చేశారని మండిపడ్డారు. ఫలితంగానే అంతకు ముందు నాణ్యమైన విద్యలో 3వ స్థానంలో ఉన్న ఆంధ్రప్రదేశ్‌ను 19 స్థానానికి పడేసిన ఘనుడు జగన్ రెడ్డని ఎద్దేవా చేశారు. ప్రభుత్వబడులకి రంగులు మార్చడం తప్ప అతడు చేసింది శూన్యమని, పైగా టీచ ర్లపై కక్షగట్టి కేసులు పెట్టి వేధించి దుర్మార్గపు పాలనను 2019-24 మధ్య రాష్ట్రంలో చూశామన్నారు. మళ్లీ ఇంతకాలానికి కూటమి ప్రభుత్వంలో ప్రభుత్వ బడులకు టీచర్లు వస్తున్నారని, వారికి ప్రతినెలా 1వ తేదీనే జీతాలు అందుతున్నాయని.. అందుకు ప్రతి ఒక్కరు హర్షం వ్యక్తం చేస్తున్నట్లు తెలిపారు.

గురజాల డీసీసీబీ అక్రమాలపై విచారణ

సెప్టెంబరు 22 నాటికి ముగించాలని ప్రభుత్వ ఆదేశం

గుంటూరు సిటీ, ఆగస్టు 25(ఆంధ్రజ్యోతి): వైసీపీ ప్రభుత్వ హయాంలో అనేక అవినీతి, అక్రమాలు చోటుచేసుకున్న పల్నాడు జిల్లా గురజాల డీసీసీబీ (జిల్లా సహకార కేంద్ర బ్యాంకు) బ్రాంచ్ అక్రమాలపై ప్రభుత్వం విచారణకు ఆదేశించింది. విచారణను సెప్టెంబరు 22 నాటికి పూర్తి చేయాలని వ్యవసాయ శాఖ ఎక్స్ అఫీషియో కార్యదర్శి బుడితి రాజశేఖర్ సోమవారం జీఓ 742 విడుదల చేశారు. గురజాల డీసీసీబీ శాఖలో సుమారు రూ. 11 కోట్ల అక్రమాలు జరిగినట్లు గతంలో ఆరోపణలు వెలువెత్తాయి. బ్రాంచ్ పరిధిలోని కోల్డ్ స్టోరేజ్ పేరిట కూడా భారీ మోసం జరిగింది. రైతులకు తెలియకుండానే వారి పేర్లతో రుణాలు పొందటం, స్టాక్ మాయం చేయటం వంటి అక్రమాలు చోటు చేసుకున్నాయి.

వ్యవసాయ శాఖ దాడులు

రూ.3.68 కోట్ల పురుగుమందుల అమ్మకాల నిలిపివేత

గుంటూరు సిటీ, ఆగస్టు 25(ఆంధ్రజ్యోతి): అసలు ఆ పురుగు మందులకు ఏ విధమైన అనుమతి లేదు.. కొన్నేమో కాలం చెల్లినవి.. కొన్నేమో ప్రభుత్వం నిషేధించినవి.. పోనీ షాపులకేమైనా సరైన అనుమతులు ఉన్నాయా అంటే.. అదీ లేదు. మరి ఇన్నేళ్లుగా వేల కోట్ల రూపాయల వ్యాపారం ఎలా చేస్తున్నారో అర్థం కావటం లేదు. ఏమీ లేకపోయినా దర్జాగా వ్యాపారం చేస్తున్న బడా వ్యాపారుల దందా వ్యవసాయశాఖ తనిఖీలలో గుట్టురట్టు అయ్యింది. గుంటూరు పట్టణంలోని పురుగు మందుల కంపెనీలను, డిస్ట్రిబ్యూటర్ షాపులను, గోడౌన్స్‌ను, డీలర్స్ దుకాణాలను వ్యవసాయశాఖ అధికారులు సోమవారం జిల్లా వ్యవసాయ అధికారి అయితా నాగేశ్వరరావు ఆధ్వర్యంలో ఆకస్మికంగా తనిఖీ చేశారు. రాష్ట్రంలో నిషేధం ఉన్న కలుపు మందును దిగుమతి చేసుకుంటూ పట్టుబడిన శబరి క్రాప్ కేర్ సైన్స్ ప్రయివేట్ లిమిటెడ్‌లో తొలుత తనిఖీలు నిర్వహించారు. అక్కడ రూ.1,45,61,542 విలువ చేసే 28,744 లీటర్ల పురుగు మందుల అమ్మకాలు నిలిపి వేస్తూ ఆదేశాలు జారీ చేశారు. అనంతరం ఆటోనగరలోని ధర్మాజ్ క్రాప్ గార్డ్, సుమిటోమో కెమికల్స్ ఇండియా, యునైటెడ్ పెస్టిసైడ్స్ రాయిపూర్, గోరంట్లలోని హిందుస్తాన్ ఆగ్రో ఇన్‌సెక్టిసైడ్స్‌లో తనిఖీలు నిర్వహించారు. ఈ దాడుల్లో రూ. 2.22 కోట్లు విలువ చేసే 62,418 లీటర్ల పురుగు మందుల అమ్మకాలు నిలిపి వేశారు. చాలా మంది వ్యాపారులు సరైన అనుమతి, పత్రాలు లేకుండానే పురుగు మందుల అమ్మకాలు జరిపినట్లు అధికారులు గుర్తించారు. ఈ దాడుల్లో డీడీఏ జీ లక్ష్మణకుమార్, ఏడీఏ లు జీ కల్యాణ్ కుమార్, సురేషన్, శశిధర్ రెడ్డి, గుంటూరు ఏడీఏ ఎన్ మోహన్ రావు, ఏఓలు కే వెంకటరావు, సుజాత, కిషోర్ తదితరులు పాల్గొన్నారు.



ఆటోనగర్‌లోని పురుగు మందుల తయారీ కేంద్రంలో తనిఖీలు నిర్వహిస్తున్న అధికారులు

సాగర్ జలాశయానికి కొనసాగుతున్న వరద

● 26 క్రస్ట్‌గేట్ల ద్వారా నీటి విడుదల



విజయపురిసౌత్, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): నాగార్జున సాగర్ జలాశయానికి శ్రీశైలం నుంచి వరద ప్రవాహం కొనసాగుతోంది. సోమవారం శ్రీశైలం నుంచి 2,50,006 క్యూసెక్కుల వరద నీరు వస్తుండడంతో ప్రాజెక్ట్ అధికారులు 26 క్రస్ట్‌గేట్ల ద్వారా దిగువకు నీటిని విడుదల చేస్తున్నారు. సాగర్ జలాశయం నీటిమట్టం 585.10 అడుగులు ఉంది. ఇది 297.72 టీఎంసీలకు సమానం. కుడి కాలువ ద్వారా 9387 క్యూసెక్కులు, ఎడమ కాలువ ద్వారా 7601 క్యూసెక్కులు, ప్రధాన జల విద్యుత్ కేంద్రం ద్వారా 33,576 క్యూసెక్కులు, 26 క్రస్ట్‌గేట్లను 5 అడుగుల మేర ఎత్తి 1,96,742 ఎస్ఎల్‌బీసీ ద్వారా 2400, ఎల్ఎల్‌సీ ద్వారా 300 క్యూసెక్కులు, మొత్తం ఔట్‌ఫ్లో వాటర్‌గా 2,50,006 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు.

టెయిల్‌పాండ్ విద్యుత్ ప్రాజెక్టుకు తగ్గిన వరద

రెంటచింతల,ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి) : సత్రశాలలోని కృష్ణానదిపై నిర్మితమైన నాగార్జునసాగర్ టెయిల్‌పాండ్ విద్యుత్ ప్రాజెక్టుకు ఎగువన ఉన్న సాగర్ నుంచి వరద నీరు రావడం గణనీయంగా తగ్గినట్లు ఎస్ఈ కే వెంకటరమణ చెప్పారు. 11 రేడియల్ క్రస్ట్ గేట్లను 4 మీటర్ల మేర ఎత్తి దిగువన వున్న పులిచింతలకు 2,28,030 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నామన్నారు.సాగర్ నుంచి 2,30,048 క్యూసెక్కుల నీరు రిజర్వాయర్‌కు చేరుతోందన్నారు.ప్రస్తుతం 74.40 మీటర్ల మేర నీరుండగా ఈ నీరు 6.080 టీఎంసీలకు సమానమన్నారు.విద్యుదుత్పత్తి నిలిపివేశారు.



11 క్రస్ట్‌గేట్ల ద్వారా విడుదలవుతున్న నీరు

పులిచింతల సమాచారం

అచ్చంపేట, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి) : పులిచింతల ప్రాజెక్టులో సోమవారం 37.32 టీఎంసీల నీటి నిల్వ ఉన్నట్టు పులిచింతల ప్రాజెక్టు ఏఈ రాజు తెలిపారు. ఎగువ నుంచి 2,59,230 క్యూసెక్కుల నీరు ప్రాజెక్టుకు చేరుతోంది. ప్రాజెక్టు వద్ద పవర్ జనరేషన్ ద్వారా 16,600 క్యూసెక్కులు, లీకుల ద్వారా నాలుగు వందల క్యూసెక్కులు, నాలుగు గేట్ల ద్వారా 1,29,176 క్యూసెక్కులు, మొత్తం 1,46,176 క్యూసెక్కుల నీరు దిగువ కృష్ణకు విడుదల అవుతున్నాయి.

పశ్చిమడెల్టాకు 8216 క్యూసెక్కుల నీరు

దుగ్గిరాల, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): విజయవాడ ప్రకాశం బ్యారేజి నుంచి పశ్చిమడెల్టాకు 8216 క్యూసెక్కుల నీరు సోమవారం విడుదల చేస్తున్నారు. ప్రస్తుతం బ్యారేజి వద్ద 12.0 అడుగుల నీటిమట్టం ఉండగా దిగువకు 3,15,200లక్షల క్యూసెక్కులనీరు విడుదల చేస్తున్నారు. దుగ్గిరాల సబ్‌డివిజన్ నుంచి హైలెవెల్‌ఛానల్‌కు 306 క్యూసెక్కుల నీరు, రేపల్లెకాల్వకు 1875 క్యూసెక్కులనీరు తూర్పుకాల్వకు 712 క్యూసెక్కుల నీరు, పశ్చిమకాల్వకు 292 క్యూసెక్కుల నీరు, నిజాంపట్నంకాల్వకు 528 క్యూసెక్కుల నీరు, కొమ్మమూరుకాల్వకు 2940 క్యూసెక్కులనీరు విడుదల చేస్తున్నారు.

దుగ్గిరాలయార్డులో పసుపు ధరలు

దుగ్గిరాల, ఆగస్టు 25(ఆంధ్రజ్యోతి): దుగ్గిరాల పసుపుయార్డులో సోమవారం జరిగిన వేలంలో 224 బస్తాల పసుపును రైతులు వ్యాపారులకు విక్రయించారు. కొమ్ములు క్వింటాల్‌కు కనిష్ఠధర రూ.9,950, గరిష్ఠధర రూ.10,825, మోడల్‌ధర రూ.10,575 పలికాయి. కాయ క్వింటాల్‌కు కనిష్ఠధర రూ.9,980, గరిష్ఠధర రూ.10,861, మోడల్‌ధర రూ.10,450 పలికాయి.

రోడ్డుప్రమాదంలో వ్యక్తి మృతి

ఈపూరు, ఆగస్టు25(ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి చెందిన ఘటన మండలంలోని వనికుంట సమీపంలో సోమవారం జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం గురజాల మండలం జంగమేశ్వరపురానికి చెందిన శీలం ఏడుకొండలు(54) బైక్‌పై వినుకొండ వెళ్తున్నాడు. కుర్చేడు మండలం నాయుడుపాలేనికి చెందిన నాలా శ్రీను బైక్‌పై వస్తూ.. వనికుంట సమీపంలో ఎదురెదురుగా ఢీకొన్నారు. ఏడుకొండలు రోడ్డుపై పడి హెల్మెట్ కుడా పగిలి తలకు బలంగా దెబ్బతగిలడంతో చనిపోయాడు. శ్రీనుకు తీవ్ర గాయాలు కావడంతో వినుకొండ ఆసుపత్రికి తరలించారు. మృతుడు ఏడుకొండలు కోలాటాలకు డప్పు కొడుతుంటాడు. మృతుడికి బార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు. కేసు నమోదు చేసినట్లు ఏఎస్ఐ సాంబయ్య తెలిపారు.

తాగునీరు అనుకుని..

విషద్రవం తాగి వ్యక్తి మృతి

ఈపూరు,ఆగస్టు25(ఆంధ్రజ్యోతి): తాగు నీరు అనుకొని చెరువులో మురుగు శుభ్రం చేసే.. విష ద్రవం తాగి వ్యక్తి మృతి చెందిన ఘటన మండలంలోని గుండేపల్లిలో జరిగింది. గ్రామానికి చెందిన చెరువులో చేపలు పడుతున్నారు. చెరువు వద్ద విష ద్రవం ఉండే డబ్బాలోని నీటిని తాగు నీరు అనుకుని చేపలు పట్టడానికి వచ్చిన ఆకుల రామాంజినేయులు(25) తాగాడు. దీంతో అతను అక్కడే పడిపోవడంతో.. ఇతర చేపలు పట్టేవాళ్ల నర్సరావుపేట ప్రభుత్వాసుపత్రికి అతనిని తీసుకెళ్లారు. అక్కడి నుంచి గుంటూరు ప్రభుత్వాసుపత్రిలో చేర్పించగా.. చికిత్స పొందుతూ ఆదివారం సాయంత్రం రామాంజినేయులు మృతిచెందాడు. స్వగ్రామం నర్సరావుపేట శివసంజీవనగర్ కు మృతదేహాన్ని తరలించారు. కేసు నమోదు చేసినట్లు ఈపూరు పోలీసులు తెలిపారు.

5.98 మెట్రిక్ టన్నుల ఎరువులు సీజ్

భట్టిప్రోలు (కొల్లూరు), ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు తనిఖీలు చేసి 5.98 మెట్రిక్ టన్నుల ఎరువులను సీజ్ చేశారు. సోమవారం భట్టిప్రోలులోని సోమశేఖర్ ఫెర్టిలైజర్స్ దుకాణంలో విజిలెన్స్ సీఐ చంద్రశేఖర్ ఆధ్వర్యంలో ఆకస్మి తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఫారం-ఓ లేని ఇన్‌క్లూజివ్ కానీ రూ.35,446 విలువైన 5.98 మెట్రిక్ టన్నుల ఎరువుల అమ్మకాలను నిలుపుదల చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. తనిఖీల్లో విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఏవో సీహెచ్.ఆదినారాయణ, ఏఓ బ్రహ్మారెడ్డి, వ్యవసాయ శాఖ సిబ్బంది పాల్గొన్నారు.



ఎరువుల దుకాణంలో తనిఖీలు చేస్తున్న ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు

అనుమానాస్పదస్థితిలో

ఇద్దరు యువకుల మృతి

పిడుగురాళ్ల, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): పిడుగురాళ్లకు సమీపంలోని జానపాడు రైల్వే గేటు వద్ద సోమవారం ఇరువురు యువకులు మృత దేహాలను స్థానికులు గుర్తించారు.పోలీసుల కథనం ప్రకారం వారిని పట్టణంలోని గాంధీనగర్‌కు చెందిన ఇరువురు స్నేహితులు షేక్ షరీఫ్ (22), గరికపూడి ఏసుదాసు (35)గా గుర్తించారు. ఆదివారం రాత్రి 10.30 గంటల తరువాత ఒక వ్యక్తి నుంచి వచ్చిన ఫోన్ కాల్‌తో ఏసు దాసు ఇంట్లో నుంచి బయటకు వెళ్లాడని, ఆ తరువాత ఏమి జరిగిందో తెలియలేదని కుటుంబ సభ్యులు తెలిపారు. తెల్లవారిన తరువాత మృత దేహాలు రైల్వేట్రాక్ సమీపంలో వున్నట్లు తెలియడంతో కుటుంబసభ్యులు మృతదేహాలను చూసి అనుమానం వ్యక్తం చేస్తూ రైల్వే పోలీసులకు సమాచారం ఇచ్చారు. షేక్ షరీఫ్ అదే ప్రాంతానికి అరగంట ముందు వచ్చినట్లు, అతనిని కూడా ఎవరో హత్య చేశారా ? లేక మరేదైనా జరిగిందా అన్న విషయం ప్రశ్నార్థకంగా వుంది. నడికూడి రైల్వే పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం తరలించారు. అయితే కొందరు యువకుల మధ్య మద్యం మత్తులో గొడవ జరగటం వల్ల ఈ ఘటన జరిగినట్లు కుటుంబసభ్యులు రైల్వే పోలీసులకు తెలిపారు. అసలు ఘటన మద్యం మత్తులో గొడవ కారణంగా జరిగిందా.....లేక రైలు ప్రమాదమా అనేది పోలీసుల విచారణలో తేలనుంది. ఇరువురు యువకులు అనుమానాస్పదంగా మృతి చెందడంతో గాంధీనగర్ వాసులు దిగ్భ్రాంతికి గురయ్యారు. రైల్వే పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



షేక్ షరీఫ్ (ఫైల్‌ఫొటో)



గరికపూడి ఏసుదాసు (ఫైల్‌ఫొటో)

48,590 మిర్చి టిక్కీల అమ్మకం

గుంటూరు, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): మిర్చియార్డుకు సోమవారం 50,261 మిర్చి టిక్కీలు విక్రయానికి రాగా ముందురోజు నిల్వ ఉన్న వాటితో కలిపి 48,590 అమ్మకం జరిగినట్లు గుంటూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ ఉన్నతశ్రేణి కార్యదర్శి ఏ చంద్రిక తెలిపారు. ఇంకా యార్డు ఆవరణలో 9,501 మిర్చి టిక్కీలు నిల్వ ఉన్నట్లు పేర్కొన్నారు. వివిధ రకాల మిరపకాయలకు ధరలు ఈ కింది విధంగా నమోదయ్యాయి.

వెరైటీ	కనిష్ఠధర	గరిష్ఠధర
నాన్ ఏసీ కామన్ వెరైటీ		
334	10000	14200
నెంబరు. 5	10000	13500
273	10000	13600
341	10000	15000
4884	----	----
సూపర్ 10	----	----
నాన్ ఏసీ స్పెషల్ వెరైటీ		
తేజ	10000	15000
షార్క్-1	-----	----
బ్యాడిగి 355	10000	14300
దేవనూరు డీలక్స్	10000	13500
ఆర్మూరు	9800	11500

వెరైటీ	కనిష్ఠధర	గరిష్ఠధర
ఏసీ కామన్ వెరైటీ		
334	9500	13800
నెంబరు. 5	10000	13500
273	----	----
341	11000	15200
4884	10000	13000
ఏసీ స్పెషల్ వెరైటీ		
తేజ	10000	15000
బ్యాడిగి 355	10000	14000
దేవనూర్ డీలక్స్	10500	13600
ఆర్మూరు	----	----
తాలుకాయలు	5000	7600

నిరుద్యోగులకు కూటమి ప్రభుత్వం ఆశాజ్యోతి

ఇచ్చిన మాట నిలబెట్టి మెగా డీఎస్సీ : యరపతినేని

పిడుగురాళ్ల, ఆగస్టు 25 (ఆంధ్ర జ్యోతి): రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం యువతకు ఇచ్చిన మాట ప్రకారం 16,347 టీచర్ పోస్టులతో మెగా డీఎస్సీ నిర్వహించడం జరిగిందని గురజాల ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇక ప్రతి ఏటా డీఎస్సీ నిర్వహిస్తూ యువ ఉపాధ్యాయులతో విద్యారంగాన్ని దేశంలోనే తొలిస్థానంలో నిలబెట్టేందుకు కూటమి ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. యువత బాగుపడటం, వారికి ఉద్యోగ అవకాశాలు రావడం ఇష్టంలేని జగన్ మెగా డీఎస్సీని ఆపేందుకు 24 కేసులు కోర్టు ద్వారా వేయించారని, వాటన్నింటిని అధిగమించి మెగా డీఎస్సీ ప్రక్రియను పూర్తిచేసిన ఘనత ఐటీ, విద్యాశాఖా మంత్రి నారా లోకేశ్‌ది అన్నారు. 2014-19 మధ్య రెండు డీఎస్సీలు నిర్వహించి 18 వేల ఉపాధ్యాయ పోస్టులను ఆనాడు భర్తీ చేయడం జరిగిందని, చంద్రబాబునాయుడు 14 ఏళ్ల ముఖ్యమంత్రి హోదాలో 13 డీఎస్సీల ద్వారా లక్షా 80 వేల 208 ఉపాధ్యాయ పోస్టులను భర్తీ చేయడం జరిగిందన్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పడిన తరువాత సమగ్ర శిక్షణ సొసైటీ ఆధ్వర్యంలో కస్తూర్బా గాంధీ విద్యాలయాల్లో ఖాళీగా వున్న 729 నాన్‌టీచింగ్ పోస్టులను భర్తీచేసి 90 మంది ఎస్టీ యువతను కొత్త ఉపాధ్యాయులుగా నియమించడం జరిగిందన్నారు. 476 ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో 3,619 కాంట్రాక్ట్ లెక్చరర్ల సేవలను పునరుద్ధరణ చేయడం జరిగిందని, టీచర్లపై పని ఒత్తిడి తగ్గించేందుకు గత ప్రభుత్వ హయాంలో వున్న ఆరు రకాల బడుల విధానాన్ని కూటమి ప్రభుత్వం 9 రకాలుగా మార్చడం జరిగిందన్నారు. నాటి వైసీపీ ప్రభుత్వ హయాంలో ఉపాధ్యాయులపై కక్షసాధింపు చర్యలకు పాల్పడ్డారని, ఉపాధ్యాయులను మద్యం దుకాణాలకు కాపలాగా పెట్టించి పాఠశాలలో మరుగుదొడ్లు కడిగించారని అని ఎమ్మెల్యే యరపతినేని దుయ్యబట్టారు.

స్కూలు వ్యాను రేడియేటర్ పగిలి విద్యార్థులకు గాయాలు



చెరుకుపల్లి, ఆగస్టు 25(ఆంధ్రజ్యోతి): చెరుకుపల్లిలో విద్యార్థుల్ని ఎక్కించుకుని వెళుతున్న హోలియర్ వరల్డ్ స్కూల్ వ్యాను రేడియేటర్ పగలడంతో దానిలోని వేడినీరు విద్యార్థుల కాళ్లపై పడి ముగ్గురు విద్యార్థులు గాయాలపాలయ్యారు. గాయపడిన విద్యార్థులు చైతన్య, అఖిల్ 6వతరగతి చదువుతున్నారు. మరో విద్యార్థి నిషాల్ 9వ తరగతి చదువుతున్నాడు. గాయపడిన విద్యార్థులను వెంటనే దగ్గరలో ఉన్న ప్రయివేటు ఆసుపత్రికి తరలించి చికిత్స అందించారు. పెద్ద ప్రమాదం తప్పడంతో ఊపిరిపీల్చుకున్నారు. ఎస్ఐ టీ అనిల్‌కుమార్ విద్యార్థులను పరామర్శించి వివరాలు నమోదు చేసుకున్నారు.

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

● విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.5.40 ● నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్ (కిలో)	111, 119, 130
చికెన్ విత్ స్కిన్(కిలో)	210.00
చికెన్ స్కిన్ లెస్(కిలో)	220.00

బహిరంగ సభను జయప్రదం చేయండి

● ఎమ్మెల్యే బ్రహ్మానందరెడ్డి

కారంపూడి, ఆగస్టు 25(ఆంధ్రజ్యోతి): కారంపూడి పట్టణంలోని ఆర్‌అండ్‌బీ బంగ్లా వద్ద ఈనెల 29వ తేదీన నిర్వహించనున్న భారీ బహిరంగ సభను జయప్రదం చేయాలని ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి కోరారు. సోమవారం ఆయన మాట్లాడుతూ స్త్రీశక్తి మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం పథకాన్ని అమలుచేస్తున్న సందర్భాన్ని పురస్కరించుకొని 6వేల మందితో బహిరంగ సభను నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ముఖ్య అతిథులుగా విద్యుత్‌శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్, నరసరావుపేట ఎంపీ శ్రీకృష్ణదేవరాయలు పాల్గొంటారన్నారు.

మైనార్టీల అభ్యున్నతే టీడీపీ లక్ష్యం

బెల్లంకొండ, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో మైనార్టీల అభ్యున్నతే టీడీపీ లక్ష్యమని రాష్ట్ర మైనార్టీ సెల్ ప్రధాన కార్యదర్శి పీఎస్‌కే మస్తాన్ షరీఫ్ పేర్కొన్నారు. సోమవారం సాయంత్రం బెల్లంకొండ పార్టీ కార్యాలయంలో ముస్లిం మైనార్టీలతో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలోని క్రోసూరు మార్కెట్ యార్డు చైర్మన్‌గా మైనార్టీలకు ఇవ్వటం శుభపరిణామమన్నారు. మైనార్టీలకు యార్డు చైర్మన్ పదవి ఇవ్వటంపై ఎమ్మెల్యే ప్రవీణ్‌కు కృతజ్ఞతలు తెలిపారు. ఈ సమావేశంలో ముస్లిం మైనార్టీ నాయకులు, మాజీ సర్పంచ్ సయ్యద్ జానీ, పీఎస్‌కే రసూల్, సయ్యద్ మజీద్, బెల్లంకొండ వైస్ సర్పంచ్ రజాక్, డీలర్ సుభానీ, తెలుగుయువత అధ్యక్షుడు సలాం, సయ్యద్ జబ్బార్, ఇబ్రహీం, కొండవీటి అహమ్మద్ తదితరులు పాల్గొన్నారు.

తహసీల్దార్‌కు నూర్‌బాషా సంఘసభ్యుల సన్మానం

మాచర్లటౌన్, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): స్వాతంత్ర్య దినోత్సవంలో ఉత్తమ అధికారిగా అవార్డు పొందిన తహసీల్దార్ కిరణ్ కుమార్‌ను సోమవారం పట్టణంలోని మండల రెవెన్యూ కార్యాలయంలో నూర్‌బాషా సంఘ సభ్యులు దుశ్శాలువలతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో అధ్యక్షుడు ఖాసిం, ప్రధాన కార్యదర్శి అన్వర్ అక్తర్, మౌలాలి, నాసర్‌వలి, షేక్ సైదాహుస్సేన్, బాదన్‌బాయి, ఇమాంసా పాల్గొన్నారు.

విద్యార్థులకు భోజన ప్లేట్లు, గ్లాసులు అందజేత

కారంపూడి, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఒప్పిచర్ల జిల్లా పరిషత్ హైస్కూల్లో విద్యార్థులకు సోమవారం గ్రామ పెద్ద చిరుమామిళ్ల రామలక్ష్మయ్య స్టీల్ భోజన ప్లేట్లు, గ్లాసులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో హెచ్‌ఎం విలియం శౌరిబాబు, సర్పంచ్ గంగనపల్లి పుష్పలత, శివరావు, చిరుమామిళ్ల శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

వాహనాల తనిఖీ

కారంపూడి, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని నరసరావుపేట రహదారిలో సోమవారం అసిస్టెంట్ మోటారు వెహికల్ ఇన్‌స్పెక్టర్ సురేష్‌బాబు సోమవారం వాహనాల తనిఖీ చేశారు. వాహనాలకు సంబంధించిన ధ్రువీకరణ పత్రాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి వాహన చోదకుడు రహదారి భద్రత నియమాలు పాటించాలన్నారు. పరిమితికి మించి ప్రయాణికులను ఎక్కించుకుంటే కేసులు నమోదు చేస్తామన్నారు. మద్యం తాగి వాహనాలు నడిపితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ తనిఖీల్లో ఆర్టీసీ సీఐ యర్రయ్య, సిబ్బంది పాల్గొన్నారు.

ఉత్సవాల నిర్వహణకు అనుమతులు తప్పనిసరి

మాచర్లటౌన్, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): గణేష్ ఉత్సవాల నిర్వహణకు అనుమతులు తప్పనిసరి అని వెల్దుర్తి ఎస్‌ఐ సమందర్‌వలి అన్నారు. సోమవారం ఆయన మాట్లాడుతూ ఉత్సవాల నిర్వహణకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. రిజిస్ట్రేషన్ పూర్తయిన తరువాత క్యూఆర్ కోడ్‌ను చవితి పందిరికి అతికించాలన్నారు.

ప్రకృతి వ్యవసాయంతో లాభాలు పొందవచ్చు

మాచవరం, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): ప్రకృతి వ్యవసాయం ద్వారా తక్కువ ఖర్చు పెట్టి ఎక్కువ ఆదాయం తీసుకోవటమే కాకుండా నిరంతరం పంట ఉండేలా చూసుకోవచ్చునని ప్రకృతి వ్యవసాయ యూనిట్ ఇన్‌చార్జ్ సునీల్ కుమార్ తెలిపారు. సోమవారం మండలంలోని కొత్త గణేమనిపాడులో యూనిట్‌లో సింగరాయపాలెం తండా గ్రామం లో ప్రకృతి వ్యవసాయ సిబ్బంది ఏటీఎం మోడల్ వేయటం జరిగింది. కార్యక్రమంలో మార్కెటింగ్ ఎంటీ సుబ్బారెడ్డి, ఐసీఆర్‌పీఎస్ శ్రీనునాయక్, ఉషారాణి తదితరులు పాల్గొన్నారు.

మట్టి వినాయక ప్రతిమలు అందజేత

పిడుగురాళ్ల, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): పిడుగురాళ్ల రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో సోమవారం స్థానిక ఐలాండ్ సెంటర్లో మట్టి వినాయక ప్రతిమలను పంపిణీ చేశారు. పర్యావరణానికి హాని కలుగకుండా మట్టి గణపతులను పూజించాలని ఆర్యవైశ్య నాయకుడు కనిగిరి శ్రీనివాసరావు, రోటరీక్లబ్ అధ్యక్షుడు కోట రమేష్, పాండురంగ శ్రీనులు తెలిపారు.

● దాచేపల్లి: దాచేపల్లి జడ్పీ హైస్కూల్లో హెచ్‌ఐవీ, ఎయిడ్స్‌పై అవగాహన ర్యాలీ నిర్వహించారు. సోమవారం జిల్లా వైద్య ఆరోగ్యశాఖ హెచ్‌ఐవీ ఎయిడ్స్ తదితర సంస్థల ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు.

రేపటి నుంచి గణపతి నవరాత్రి ఉత్సవాలు

అమరావతి, ఆగస్టు 24(ఆంధ్రజ్యోతి): మండలంలోని ధరణికోటలో కంచికామకోటి పీఠ సిద్ధిబుద్ధి సమేత విఘ్నేశ్వరస్వామి ఆలయంలో ఈనెల 27నుంచి సెప్టెంబరు 4వ తేదీ వరకు 31వ గణపతి నవరాత్రి మహోత్సవాలు జరుగుతాయని ఆలయ ధర్మకర్త దండా సాంబశివరావు తెలిపారు.

వినాయక విగ్రహాల అనుమతికి కమిటీ

క్రోసూరు, ఆగస్టు 25(ఆంధ్రజ్యోతి): వినాయకవిగ్రహాలు ఏర్పాటుచేసుకొనేందుకు ప్రభుత్వ అధికారుల ఆధ్వర్యంలో ఐదుగురు సభ్యుల కమిటీ అనుమతి తప్పనిసరిగా పొందాలని తహసీల్దార్ వెంకటనాగరాజు సోమవారం ప్రకటనలో తెలిపారు.

● దుర్గి: వినాయకచవితి పండుగను పురస్కరించుకొని ఏర్పాటుచేయనున్న మండపాలకు అనుమతులు తప్పనిసరి అని ఎస్‌ఐ సుధీర్‌కుమార్ అన్నారు. సోమవారం ఆయన మాట్లాడుతూ మండపాల వద్ద డీజేలకు అనుమతి లేదన్నారు. రాజకీయ పార్టీల పార్టీలు, జెండాలు పెట్టవద్దన్నారు.

రెంటచింతలలో చవితి కళ..

రెంటచింతల, ఆగస్టు 25(ఆంధ్రజ్యోతి): పూజలందుకునేందుకు గణనాథులు సిద్ధమయ్యారు. ఊరూవాడా నవరాత్రి వేడుకలకు సన్నాహాలు చేస్తున్నారు. గణేష్ ఉత్సవ కమిటీలు చందాలు వసూలు, టెంట్లతో పందిరి నిర్మాణాలు, మిర్యాలగూడ, హాలియా తదితర ప్రాంతాల నుంచి వినాయకుడి విగ్రహాలను కొనుగోలు చేసి తీసుకొచ్చారు. బుధవారం జరుపుకునే హిందువుల తొలి పండుగకు అన్ని ఏర్పాట్లు చేస్తున్నారు. రెంటచింతలతో పాటు ప్రతి గ్రామంలోను విగ్రహాల ఏర్పాటుకు ఆన్‌లైన్ ద్వారా అనుమతి కోసం దరఖాస్తు చేసుకున్నారు. కిందటేడాది సుమారు చిన్నా చితక విగ్రహాలు ఏవైతేనేమి 61 దాకా ఏర్పాటు చేశారు. నిమజ్జనానికి సంబంధించి సత్రశాలలోని కృష్ణానది వద్ద ఏర్పాట్లను ఎస్‌ఐ సీహెచ్ నాగార్జున సోమవారం పరిశీలించారు.

మండపాలకు మహాగణపతి ..

సత్తెనపల్లి, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వెన్నాదేవి ప్రాంతం నుంచి గణపతి విగ్రహాలను కొనుగోలు చేసి భక్తులు తమ గ్రామాలకు తీసుకెళ్తున్నారు. ఇప్పటికే పట్టణంలోని, మండలంలోని పలు ప్రాంతాల్లో వినాయక మండపాల్లో గణనాధులను ప్రతిష్ఠించారు. గణపతి మండపాలను ఆకర్షణీయంగా తీర్చిదిద్దారు.

చలో విజయవాడను జయప్రదం చేయాలి

క్రోసూరు, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): పాతపెన్షన్‌ను వెంటనే పునరుద్ధరించాలని డిమాండ్ చేస్తూ ఏపీసీపీఎస్‌ఈఏ ఆధ్వర్యంలో వచ్చే నెల ఒకటిన జరగనున్న చలో విజయవాడ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని సంఘం నాయకులు కోరారు. దీనికి సంబంధించిన గోడ పత్రికలను క్రోసూరులో సోమవారం ఆవిష్కరించారు.

కష్టపడే ప్రతి కార్యకర్తకు పదవులిచ్చి గౌరవిస్తాం

● మార్కెట్ యార్డు చైర్మన్‌గా భారతి ప్రమాణ స్వీకారం
● ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు


ఎమ్మెల్యే యరపతినేనిని సన్మానిస్తున్న యార్డు చైర్మన్ బెల్లంకొండ భారతి, బద్రి దంపతులు

దాచేపల్లి, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): కష్టపడిన ప్రతి కార్యకర్తకు పదవులు ఇచ్చి గౌరవిస్తాం.. ఆర్థికంగా బలోపేతం చేస్తాం... అని గురజాల ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు స్పష్టం చేశారు. సోమవారం నడికూడి వ్యవసాయ మార్కెట్ యార్డులో గురజాల వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్‌లు, సభ్యులు పదవీ బాధ్యతల స్వీకరణ కార్యక్రమానికి ఎమ్మెల్యే యరపతినేనితో పాటు టీటీడీ పాలకమండలి సభ్యుడు జంగా కృష్ణమూర్తి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. సభలో యరపతినేని శ్రీనివాసరావు మాట్లాడుతూ రాష్ట్రంలో మహిళలకు సముచిత స్థానం ఇచ్చి గౌరవిస్తున్నామని తెలిపారు. దాచేపల్లి, పిడుగురాళ్ళ, గురజాల నగర పంచాయతీలకు తాగునీటికి గాను 300 కోట్లు, గ్రామీణ ప్రాంతాలకు నాలుగు వందల కోట్లు నిధులు మంజూరు చేయించామన్నారు. కమ్యూనిటీ హాళ్ళకు రూ.11 కోట్లు ఇచ్చామన్నారు. బస్సుల్లో మహిళలు ఉచితంగా ప్రయాణం చేస్తుంటే తప్పుడు వీడియోలను తయారు చేసి మహిళలు బస్సుల్లో ఘర్షణ పడుతున్నారంటూ విడుదల చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. రానున్న సంక్రాంతి పండుగ నుంచి పిడుగురాళ్ళ నుంచి సూపర్- 6లో ఉచిత గ్యాస్ కనెక్షన్‌లను అమలు చేస్తామన్నారు. ఈనెల 29న మండల కమిటీలు ఏర్పాటు చేస్తామన్నారు.

స్త్రీ శక్తి కార్యక్రమం విజయవంతం చేయాలి

10వేల మంది మహిళలతో సెప్టెంబరు ఒకటిన స్త్రీ శక్తి కార్యక్రమాన్ని చేపడుతున్నాం. రాష్ట్ర వ్యాప్తంగా సీఎం చంద్రబాబునాయుడు ఆదేశాల మేరకు చేపడుతున్న స్త్రీ శక్తి కార్యక్రమాన్ని పిడుగు రాళ్ళలో నిర్వహిస్తున్నామని తెలిపారు. ప్రతి ఒక్కరు ఈ కార్యక్రమాన్ని పట్టుదలగా పని చేసి విజయవంతం చేయాలని యరపతినేని కార్యకర్తలకు ఆదేశించారు.

టీటీడీ పాలక మండలి సభ్యుడు జంగా కృష్ణమూర్తి మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అన్ని వర్గాల ప్రజలకు సముచిత స్థానం ఇవ్వటంతో మహిళలకు ప్రాధాన్యమిస్తుందంటూ వివరించారు. మార్కెట్ యార్డు కమిటీ రైతుల అవసరాలను గుర్తించి పని చేయాలని సూచన చేశారు. ఈ సభకు బెల్లంకొండ బద్రి అధ్యక్షత వహించారు. ఆయా కార్యక్రమాల్లో నాగార్జున సాగర్ ప్రాజెక్టు కమిటీ చైర్మన్ పులుకూరి కాంతారావు, గురజాల మున్సిపల్ చైర్మన్ బడే జానీ, తంగెళ్ళ శ్రీనివాసరావు, బెల్లంకొండ బద్రి, నర్ర పుల్లయ్య, వేముల వినోద్‌రెడ్డి, మునగ నిమ్మయ్య, కొప్పుల నాగేశ్వరరావు, పాముల కిషోర్, డాక్టర్ వరలక్ష్మి, నెల్లూరి రామ కోటయ్య, పురంశెట్టి పరంజ్యోతి తదితరులు పాల్గొన్నారు.

ఆత్మకూరులో గ్రామసభ

● హాజరైన జేసీ సూరజ్ ధనుంజయ గనూరే

దుర్గి, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఆత్మకూరులో సోమవారం నిర్వహించిన గ్రామసభలో జాయింట్ కలెక్టర్ సూరజ్ ధనుంజయ గనూరే హాజరయ్యారు. ఆత్మకూరు దళితుల సమస్యలను తెలుసుకొని పరిష్కరించాలని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఆదేశించడంతో అధికారులు ఈ గ్రామసభను నిర్వహించారు. దళితులు తమకు గృహాలు, పెన్షన్, పొలం, ఉద్యోగాలు ఇవ్వాలని కోరారు. దీనిపై నివేదికను ప్రభుత్వానికి సమర్పించనున్నట్లు జేసీ తెలిపారు. ఈ సమావేశంలో గురజాల ఆర్డీవో మురళీకృష్ణ, మాచర్ల తహసీల్దార్ కిరణ్‌కుమార్, ఆర్‌ఐ యోబు, ఎస్‌ఐ సుధీర్‌కుమార్ పాల్గొన్నారు.


బోనస్ పంపిణీ చేస్తున్న సంగం డెయిరీ డైరెక్టర్ ధర్మారావు, బాషా

పాల ఉత్పత్తిదారుల శ్రేయస్సే లక్ష్యం

● సంగం డెయిరీ డైరెక్టర్ వలివేటి ధర్మారావు

పెదకూరపాడు, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): పాల ఉత్పత్తిదారులకు చేయూతనందించటమే సంగం డెయిరీ లక్ష్యమని సంగం డెయిరీ డైరెక్టర్ వలివేటి ధర్మారావు అన్నారు. పెదకూరపాడులోని పాలఉత్పత్తిదారుల సహకార సంఘ ప్రాంగణంలో సోమవారం పాలఉత్పత్తిదారులకు సంగం అధ్యక్షుడు గుండపనేని బాషా ఆధ్వర్యంలో రూ.6,34,799 బోనస్‌ను పంపిణీ చేశారు. కార్యక్రమంలో పాలకేంద్రం అధ్యక్షుడు గుండపనేని బాషా, టీడీపీ మండల అధ్యక్షుడు ఏటుకూరి బ్రహ్మయ్య, అర్తిమళ్ళ రమేష్, తెలుగు రైతు జిల్లా ప్రధాన కార్యదర్శి బాష్యం ఆంజనేయులు, గోపీకృష్ణ, సర్పంచ్ గుడిపూడి రాజు, జాగర్లమూడి రఘు, మద్దినేని వెంకటసత్యనారాయణ, కర్నాటి సీతారామయ్య, అంద్ర ప్రసాదు తదితరులు పాల్గొన్నారు.

కాంపౌండర్ గురవయ్య స్మారక అవార్డుల ప్రదానం

మాచర్ల రూరల్, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని మెడికల్ అసోసియేషన్ హాలులో సోమవారం మున్సిపల్ చైర్మన్ షేక్ మదార్‌సాహెబ్ ఆధ్వర్యాన కాంపౌండర్ గురవయ్య స్మారక అవార్డుల ప్రదాన కార్యక్రమం నిర్వహించారు. వెల్దుర్తి మండలం పట్లవీడుకు చెందిన గాడిపర్తి వెంకటేశ్వర్లు, బోదలవీడుకు చెందిన లక్కాకుల శ్రీనివాసరావులకు అవార్డులను ప్రదానం చేశారు. కార్యక్రమంలో వైద్యుడు కమలహాసన్‌రావు, డాక్టర్ దాక్షాయిని, జింకల నాగేశ్వరరావు, మున్సిపల్ వైస్‌చైర్‌పర్సన్ యర్రాకుల సిద్ధమ్మ యాదవ్, టీడీపీ మండల అధ్యక్షుడు నేరేటి వీరాస్వామి, సీనియర్ నాయ వాదులు పాల్గొన్నారు.

వృద్ధులకు ఇంటి వద్దే రేషన్ పంపిణీ చేయాలి

అమరావతి, ఆగస్టు 25(ఆంధ్రజ్యోతి): మంగళవారం నుంచి ఈనెల 31లోపు వృద్ధులకు, దివ్యాంగులకు రేషన్ బియ్యాన్ని వారి ఇంటివద్దనే పంపిణీ చేయాలని డీలర్లను తహసీల్దార్ డానియేలు ఆదేశించారు. సోమవారం రేషన్ డీలర్లతో సమావేశం నిర్వహించి మండలపరిధిలో 40రేషన్ దుకాణాలకు సంబంధించి 2,759మంది లబ్ధిదారులకు బియ్యం అందజేయాలని ఆదేశించారు.

కూటమి ప్రభుత్వంతోనే రైతులకు మేలు

● ఎమ్మెల్యే కన్నా


ప్రమాణ స్వీకారం చేస్తున్న మాదల పీఏసీఎస్ పాలక వర్గం

ముప్పాళ్ళ ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): రైతులకు అన్ని విధాలుగా అండగా ఉంటూ వారికి మేలు చేకూర్చేది కూటమి ప్రభుత్వమే అని ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ అన్నారు. మండలంలోని మాదల పీఏసీఎస్ పాలకవర్గ ప్రమాణస్వీకార మహోత్సవం సోమవారం ఘనంగా జరిగింది. పీఏసీఎస్ చైర్మన్‌గా చిమటా సోలురాజు, సభ్యులుగా కొల్లా కోటేశ్వరరావు, బొప్పూడి లక్ష్మణరావులు ప్రమాణస్వీకారం చేశారు. నూతనపాలక వర్గానికి ఎమ్మెల్యే కన్నా, జీడీసీసీ చైర్మన్ మక్కెన మల్లికార్జునరావులు అభినందనలు తెలిపారు. అనంతరం మాదల హైస్కూల్లో మధ్యాహ్నబోజనాన్ని ఎమ్మెల్యే పరిశీలించారు. కార్యక్రమంలో టీడీపి సీనియర్ నాయకులు దరువూరి నాగేశ్వరరావు పలువురు కూటమి నాయకులు పాల్గొన్నారు.

ఎరువుల దుకాణాల తనిఖీ


దుకాణాలను తనిఖీ చేస్తున్న తహసీల్దార్ కిరణ్‌కుమార్

మాచర్లటౌన్, ఆగస్టు 25(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ఎరువుల దుకాణాలను సోమవారం తహసీల్దార్ బందెల కిరణ్‌కుమార్ తనిఖీ చేశారు. ఎరువుల నిల్వలు, ఈ-పోస్ స్టాక్ బ్యాలెన్స్‌లు, స్టాక్ రిజిష్టర్, ఇన్వాయిస్ కాపీలు, బిల్‌పుస్తకాలు పరిశీలించారు. డీలర్లు ప్రభుత్వ నిబంధనలకు లోబడి వ్యాపారం చేయాలన్నారు. ఎమ్మార్పీ ధరల కన్నా అధిక ధరలకు ఎరువులను విక్రయిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

విచక్షణా రహితంగా ఎరువులను వాడొద్దు..

రెంటచింతల, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): విచక్షణారహితంగా ఎరువులను వాడొద్దని అధికారుల సూచనల మేరకు తగు మోతాదులో వాడాలని ఏవో కట్టా లక్ష్మారెడ్డి కోరారు. సోమవారం రెంటచింతలలోని పలు ఎరువుల దుకాణాలను, రైతు సేవా కేంద్రాలు, మార్కెట్ యార్డులోని గొడౌన్లను రెవెన్యూ, పోలీసుశాఖ వారితో కలిసి తనిఖీ చేశారు.

అధిక రేట్లకు విక్రయిస్తే కఠిన చర్యలు

బెల్లంకొండ, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): ఎరువులు అధిక రేట్లకు విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని బెల్లంకొండ వ్యవసాయ శాఖ అధికారి అరుణకుమారి, ఎస్‌ఐ ప్రవీణ్ తెలిపారు. సోమవారం బెల్లం కొండ ఎరువుల నిల్వల గోడౌన్లలో తనిఖీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వ నిబంధనల ప్రకారమే ఎరువులు విక్రయించాలని సూచించారు. యూరియా కొరత లేదని, ప్రతి దుకాణంలో యూరియా ఉందని తెలిపారు. అనంతరం బెల్లంకొండ ఎరువుల గోడౌన్లలో తనిఖీ చేశారు. ఈ తనిఖీల్లో ఏవో, ఎస్‌ఐతో పాటు మండల స్థాయి అధికారులు తదితరులు పాల్గొన్నారు.

మాచర్ల మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్- 2గా జ్యోతి


జ్యోతికి నియామకపత్రం అందిస్తున్న ఆర్డీవో మురళీకృష్ణ

మాచర్లటౌన్, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): మాచర్ల మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్- 2 ఎన్నికల్లో ఐదో వార్డుకు చెందిన కలివెల జ్యోతి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. సోమవారం పట్టణంలోని పురపాలక సంఘ కార్యాలయంలో వైస్ చైర్‌పర్సన్- 2 ఎన్నికల్లో ఏకగ్రీవంగా ఎన్నికైన జ్యోతిని ఎన్నికల రిటర్నింగ్ ఆఫీసర్, గురజాల ఆర్డీవో మురళీకృష్ణ వైస్ చైర్ పర్సన్- 2గా ప్రకటిస్తూ నియామకపత్రం అందించారు. అనంతరం జ్యోతితో ప్రమాణ స్వీకారం చేయించారు. ఈ కార్యక్రమంలో చైర్మన్ షేక్ మదార్‌సాహెబ్, వైస్ చైర్‌పర్సన్ యర్రాకుల సిద్ధమ్మ యాదవ్ పాల్గొన్నారు. తన ఎన్నికకు సహకరించిన ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి, టీడీపీ నేతలు, పురపాలక సంఘ చైర్మన్, వైస్ చైర్మన్, కౌన్సిలర్లకు జ్యోతి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ వేణుబాబు, టీడీపీ పట్టణ అధ్యక్షుడు కొమెర దుర్గారావు, సీనియర్ నేత కేశవరెడ్డి పాల్గొన్నారు.


మహిళలకు ఉచిత బస్సుతో జీవనోపాధి కోల్పోయాం..

నకరికల్లు, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం మహిళలకు ప్రవేశ పెట్టిన ఉచిత బస్సు పథకంతో తమ జీవనోపాధిని కోల్పోయామని ఆటో డ్రైవర్లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సోమవారం ఈ మేరకు డిప్యూటీ తహసీల్దార్ తుమ్మా కొండారెడ్డికి ఆటో డ్రైవర్ల, ప్రజాసంఘాల నాయకులతో కలిసి వినతిపత్రం అందజేశారు.

వృద్ధులు, దివ్యాంగులకు ఇంటి వద్దే సరుకులు అందజేయాలి

మాచవరం, ఆగస్టు 25(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం వృద్ధులు, దివ్యాంగులకు ఇంటివద్దకే నిత్యావసరాల పంపిణీ కార్యక్రమాన్ని నూరుశాతం పూర్తిచేయాలని తహసీల్దార్ నాగమల్లేశ్వరరావు డీలర్లను ఆదేశించారు. సోమవారం తహసీల్దార్ కార్యాలయంలో సరుకుల పంపిణీపై డీలర్లతో సమావేశం నిర్వహించారు. మంగళవారం నుంచే నిత్యావసరాల పంపిణీ ప్రారంభించి నెలాఖరుకు నూరుశాతం పూర్తిచేయాలని ఆదేశించారు. అలా చేయనివారిపై చర్యలు తీసుకుంటామన్నారు. సమావేశంలో డీటీ స్రవంతి, మండల డీలర్ల సంఘం అధ్యక్షుడు నాగేశ్వరరావు పాల్గొన్నారు.

డొంక రోడ్లకు మహర్దశ



గణపవరంలో పనులు ప్రారంభిస్తున్న టీడీపీ నాయకులు మల్లి, డాక్టర్ వడ్డెంపూడి పవన్‌కుమార్‌లు

రాజుపాలెం, ఆగస్టు 25(ఆంధ్రజ్యోతి): గ్రామాల్లోని పొలాలకు వెళ్లే డొంక రోడ్లు అస్తవ్యస్తంగా మారి రాకపోకలకు ఇబ్బంది ఉందని ఆయా గ్రామాలకు చెందిన కూటమి నాయకులు, రైతులు ఎంపీ లావు శ్రీకృష్ణ దేవరాయల దృష్టికి తీసుకువెళ్లారు. స్పందించిన ఎంపీ వెంటనే డొంక రోడ్లను బాగు చేసుకోవాలని ప్రొక్లెయిన్ పంపించారు. ఉప్పలపాడు, రెడ్డిగూడెం గ్రామాల్లో పనులు పూర్తి కావటంతో సోమవారం గణపవరంలోని డొంక రోడ్లు బాగు చేసేందుకు ప్రొక్లెయిన్ రావటంతో టీడీపీ నేతలు మన్నెం శివనాగ మల్లేశ్వరరావు, డాక్టర్ వడ్డెంపూడి పవన్‌కుమార్ తదితరులు పనులను ప్రారంభించారు.

రైతు సేవా కేంద్రాల్లో యూరియా పంపిణీ

● జిల్లా వ్యవసాయ అధికారి ఎం జగ్గారావు

నకరికల్లు, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): రైతు సేవాకేంద్రాల్లో యూ రియాను పంపిణీ చేస్తున్నట్టు జిల్లా వ్యవసాయ అధికారి ఎం జగ్గారావు తెలిపారు. ఆంధ్రజ్యోతిలో ఎరువులు ఉన్నా ఈపోస్ లేక పంపిణీ నిలిచిందన్న వార్తకు స్పందించారు.ఈపోస్‌తో సంబంధం లేకుండా పల్నాడు జిల్లాలోని అన్ని రైతు సేవాకేంద్రాల్లో యూరియా పంపిణీ చేస్తున్నట్టు ఆయన తెలిపారు. సోమవారం మండలంలోని రైతు సేవాకేంద్రాల్లో యూరియా పంపిణీ చేశారు. రూపెనగుంట్ల, దేచవరం, చీమలమర్రి, గుండ్లపల్లి, నరసింగపాడు రైతు సేవాకేంద్రాల్లో యూరియా పంపిణీ చేశారు.


చీమలమర్రిలో యూరియాను పంపిణీ చేస్తున్న పీఎస్ మమత, అగ్రికల్చర్ అసిస్టెంట్ రాజశేఖరరెడ్డి

రోటరీ క్లబ్ నూతన సభ్యుల పరిచయ కార్యక్రమం

మాచర్ల రూరల్, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని వైభవ్ రెసిడెన్షియల్ ఫంక్షన్ హాల్లో ఆదివారం రాత్రి రోటరీ క్లబ్ నూతన సభ్యుల పరిచయ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. నూతన సభ్యులకు సీనియర్ రోటేరియన్లు పలు సలహాలు, సూచనలు చేశారు. మున్సిపల్ కమిషనర్ ధూళిపాళ్ల వేణుబాబు, కూరపాటి శ్రీనివాసరాజు, ఆవుల వీరాంజనేయులు, సింహారెడ్డి, పంతంగి వెంకటేశ్వర్లు, సూర్యదేవర నరసింహారావు, ఉదయ్‌లను పరిచయం చేశారు. ఈ కార్యక్రమంలో క్లబ్ అధ్యక్షుడు తుమ్మల సత్యప్రసాద్, సెక్రటరీ ఆలేటి కోటేశ్వరరావు, ట్రెజరర్ యనమదల వెంకట్రామయ్య, ప్రోగ్రాం కన్వీనర్ కర్నాటి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

ఉరి వేసుకుని వ్యక్తి ఆత్మహత్య

ముప్పాళ్ళ ఆగస్టు 25(ఆంధ్రజ్యోతి): ఉరివేసుకుని వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న సంఘటన సోమవారం జరిగింది. మండలంలోని చాగంటివారిపాలేనికి చెందిన మారూరి రామలింగారెడ్డి(51) తహసీల్దార్ కార్యాలయం వెనుక వైపున్న చెట్టుకు ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. సమాచారం తెలుసుకున్న ఎస్‌ఐ ఘటనా స్థలానికి వెళ్లి మృతదేహాన్ని పరిశీలించారు. ఆత్మహత్యకుగల కారణాలను సేకరించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం సత్తెనపల్లి ఏరియా వైద్యశాలకు తరలించారు. కుటుంబకలహాల నేపథ్యంలో ఆత్మహత్య చేసుకున్నట్లు సమాచారం. మృతుని భార్య మాట్లాడుతూ తన భర్తకు అందత్వ పింఛను వచ్చేదని ఇటీవల సర్వేలో అధికారులు తొలగించారని తెలిపారు. అప్పటి నుంచి దిగులుగా ఉండేవాడని అందువల్లనే తన భర్త ఆత్మహత్య చేసుకున్నాడని ఆమె తెలిపింది.

మెగా డీఎస్సీతో మాట నిలబెట్టుకున్న ప్రభుత్వం


ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్

పెదకూరపాడు, ఆగస్టు 25(ఆంధ్రజ్యోతి): ఎన్నికలకు ముందు కూటమి నిరుద్యోగులకు ఇచ్చిన మాటను మెగా డీఎస్సీ ద్వారా నిలబెట్టుకుందని ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్ అన్నారు. గుంటూరులోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో సోమవారం ఆయన మాట్లాడుతూ కూటమి 16,347 టీచర్ పోస్టులకు పారదర్శకతతో మెగా డీఎస్సీని నిర్వహించిందన్నారు. యువ ఉపాధ్యాయులతో విద్యారంగాన్ని దేశంలోనే తొలిస్థానంలో నిలబెట్టేలా ప్రభుత్వం పని చేస్తుందన్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, ఈడబ్ల్యూఎస్, దివ్యాంగ అభ్యర్థులకు వయస్సు మినహాయింపు ఇచ్చి వారికి అండగా ప్రభుత్వం నిలిచిందన్నారు. యువత బాగు పడటం ఇష్టం లేని జగన్‌మోహన్‌రెడ్డి మెగా డీఎస్సీని ఆపటానికి 24 కేసులు వేయించారని, అవన్నీ తట్టుకొని మెగా డీఎస్సీ ప్రక్రియను పూర్తి చేసిన ఘనత లోకేశ్‌కు దక్కుతుందన్నారు. 2014-19 సంవత్సరాల మధ్య రెండు డీఎస్సీలు జరిపి 18వేల ఉపాధ్యాయ పోస్టులను నాడు టీడీపీ ప్రభుత్వం భర్తీ చేసిందన్నారు. చంద్రబాబు 14 సంవత్సరాల ముఖ్యమంత్రి హోదాలో 13 డీఎస్సీలు జరిపి 1,80,208 పోస్టులు భర్తీ చేసి చరిత్ర సృష్టించారన్నారు.

విద్యుత్ తీగలతో జాగ్రత్తగా వుండాలి


సబ్‌స్టేషన్‌ను పరిశీలిస్తున్న ఈఈ సింగయ్య

రెంటచింతల, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): వినాయక చవితి నేపథ్యంలో విద్యుత్తు వినియోగదారులు అప్రమత్తంగా ఉండాలని మండపాల ఏర్పాటు విగ్రహాల తరలింపు సమయంలో తగిన జాగ్రత్తలు తీసుకోవాలని ఏపీసీపీడీసీఎల్ ఈఈ నూతలపాటి సింగయ్య కోరారు. సోమవారం స్థానిక సబ్‌స్టేషన్‌ను సందర్శించి సిబ్బందికి పలు సూచనలు చేశారు. గ్రామాల్లో త్రీఫేజ్ ద్వారా నిరంతర విద్యుత్ సరఫరాకు ఇప్పటి వరకు 301 గ్రామాలకు సరఫరా చేస్తున్నామని మరో 22 గ్రామాల్లో పనులు జరుగుతున్నాయన్నారు. కార్యక్రమంలో ఏఈ మస్తాన్ వలి, ఎల్‌ఐ శ్రీనివాసాచారి తదితరులున్నారు.

సచివాలయ అధికారులు సమయపాలన పాటించాలి

ఎంపీడీవో విష్ణు చిరంజీవి


రికార్డులు తనిఖీ చేస్తున్న ఎంపీడీవో విష్ణు చిరంజీవి తదితరులు

మాచవరం, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): సచివాలయ సిబ్బంది సమయపాలన పాటిస్తూ ప్రజలకు అందుబాటులో ఉండి వచ్చిన అర్జీలను ఎప్పటికప్పుడు పరిష్కరించాలని ఎంపీడీవో విష్ణు చిరంజీవి ఆదేశించారు. సోమవారం మండలంలోని మోర్జంపాడు సచివాలయాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. సచివాలయానికి సంబంధించి రికార్డులను పరిశీలించారు. అనంతరం సంపద తయారీ కేంద్రాన్ని పరిశీలించి క్లాప్ మిత్రలకు, సచివాలయ సిబ్బందికి సూచనలు, సలహాలు తెలియజేశారు. ఆయన వెంట పంచాయతీ కార్యదర్శి ఖాన్, బ్రహ్మారెడ్డి, సచివాలయ సిబ్బంది ఉన్నారు.

సొసైటీ అభివృద్ధికి కృషి చేస్తా

● పీఏసీఎస్ అధ్యక్షుడు శివ


మాట్లాడుతున్న వీరాపురం సొసైటీ అధ్యక్షుడు యడ్లపల్లి శివన్నారాయణ

పిడుగురాళ్ళ, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): వీరాపురం సొసైటీ పరిధిలో ఐదు గ్రామాల రైతులకు సకాలంలో రుణాలు, ఎరువులు అందజేస్తూ సొసైటీ అభివృద్ధికి కృషి చేస్తానని వీరాపురం పీఏసీఎస్ అధ్యక్షుడు యడ్లపల్లి శివన్నారాయణ (శివ) తెలిపారు. సోమవారం వీరాపురం సొసైటీ అధ్యక్షుడిగా శివ ప్రమాణస్వీకారం చేశారు. ఈ సందర్భంగా పార్టీ నేతలు డాక్టర్ వున్నం నాగమల్లికార్జునరావు, గండికోట వెంకటేశ్వర్లు, వడ్డవల్లి సర్వేశ్వరరావు, మాజీ ఎంపీపీ యడ్లపల్లి నారాయణ, పాండురంగ శ్రీను, వడ్డవల్లి సాంబశివరావు, సయ్యద్ అమీర్‌అలితో పాటు పలువురు మాట్లాడుతూ రైతులకు మేలు జరిగే విధంగా సొసైటీ అధ్యక్షుడు పనిచేయాలన్నారు. కార్యక్రమంలో పిల్లి చెన్నారావు, వున్నం సురేష్, చింతలపూడి రామ్మూర్తి, నెక్కంటి శ్రీను, పాదర్తి రాజేశ్వరి, యలమందారెడ్డి, గౌర సత్యవతి, రావి వెంకటరమణ, పరుచూరి వెంకటరమణ, కొంకా రాధ, మేకల సాంబశివరావు, పర్వతనేని రామారావు, కడియాల సదాశివరావు తదితరులు పాల్గొన్నారు.

పెన్షనర్ల సమస్యలను పరిష్కరించాలి

● రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణారావు

మాచర్ల రూరల్, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): పెన్షనర్లు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని పెన్షనర్స్ అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి గాదె రామకృష్ణారావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం పట్టణంలోని పెన్షనర్స్ అసోసియేషన్ హాల్లో నిర్వహించిన సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. పీఆర్సీ పేరుతో పెన్షనర్లకు నష్టం జరిగిందన్నారు. డీఆర్‌లను వెంటనే ప్రకటించాలన్నారు. ఈ సమావేశంలో అధ్యక్షుడు వెంకటరెడ్డి, చంద్రయ్య, గాలీబు, గౌస్, సుబ్బారావు, కిరీటిరెడ్డి, భాస్కర్‌బాబు, శివపార్వతి, నాగార్జున రాజు, కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

కృత్రిమ కొరత సృష్టిస్తే చర్యలు

రాజుపాలెం, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): ఎరువులు కృత్రిమ కొరత సృష్టిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని తహసీల్దార్ సరోజా హెచ్చరించారు. సోమవారం మండలంలోని అంచులవారిపాలెం, కోటనెమలిపురి, పెదనెమలిపురి గ్రామాల్లో స్థానిక తహసీల్దార్ సరోజా, ఏవో వెంకటనరసయ్య, ఎస్‌ఐ వేణుగోపాల్ ఎరువుల పంపిణీ కార్యక్రమాన్ని పరిశీలించారు.



రూ. 15 వేలు దాటిన మిర్చి ధర

● మరింత పెరిగే అవకాశాలు

గుంటూరు, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): మిర్చి ధర క్రమంగా పెరు గుతోన్నది. కొత్త పంట మార్కెట్‌కు రావడానికి మరికొన్ని నెలల సమయం పట్టే అవకాశం ఉండటంతో ధర పెరుగుతున్నట్లు వ్యాపా రులు విశ్లేషిస్తున్నారు. మే నెలకు ముందు వరకు క్వింటాల్ రూ. 10 వేల నుంచి రూ. 13 వేల మధ్యనే ఉన్న మేలిమి రకాల మిరపకా యలు నేడు క్వింటాల్‌కు రూ. 2 వేలకు పైగా పెరిగాయి. సోమవారం గుంటూరు వ్యవసాయ మార్కెట్ కమిటీలో మిర్చికి క్వింటాల్ ధర రూ. 15,200 వరకు లభించింది. రోజుకు 50 వేల టిక్కీల వరకు అమ్మకాలకు డిమాండ్ ఉండటంతో మరికొద్ది రోజుల్లో ధర మరింత పెరగొచ్చని అంచనా వేస్తున్నారు. దేశ వ్యాప్తంగా మిర్చి మార్కెట్‌లో నెలకొన్న పరిస్థితులు కారణంగా ట్రేడర్లు గుంటూరు మిర్చి మార్కెట్ వైపు చూస్తున్నారు. ఒకవైపు చైనాకు ఎగుమతులు, మరోవైపు ఈశాన్య రాష్ట్రాలు, బంగ్లాదేశ్‌కు క్రమం తప్పకుండా మిర్చి లోడ్‌లు వెళుతుండటంతో డిమాండ్ స్థిరం గా కొనసాగుతున్నది. గతంలో మిర్చి లారీల సంఘం సిండికేట్ కా రణంగా ఒక లోడింగ్ చేయాలంటే రూ. 40 వేలు అదనంగా ఖర్చు అ య్యేది. సీఎం ఆదేశాలతో ఇప్పుడు అది లేకపోవడంతో వ్యాపారస్థులు కూడా పోటీ పడి ధర పెంచుతున్నారు. దీంతో మార్కెట్ ఈ వారం ప్రారంభ రోజునే ఆశాజనకంగా ముగిసింది. నంబరు. 341కి రూ. 15 వేలు, తేజకి రూ. 15 వేలు, ఏసీ వెరైటీ 341కి రూ. 15,200 ధర లభిం చడంతో రైతులు, స్టాకిస్టులు సంతోషాన్ని వ్యక్తపరుస్తున్నారు.

మైము నృత్యం ఒక అందమైన కళ

అంతర్జాతీయ కళాకారుడు మధు

ఏఎన్‌యూ, ఆగస్టు 25(ఆంధ్రజ్యోతి): సంభాషణ లేకుండా చేసే మైము నృత్యం ఒక అందమైన కళ అని అంతర్జాతీయ నటుడు డాక్టర్ మధు అన్నారు. ఏఎన్‌యూ రంగస్థలం కళాశాల శాఖ ఆధ్వర్యంలో సోమవారం మూకాభినయం (మైము) ప్రక్రియ మీద శిక్షణ శిబిరం ఏర్పాటు చేశారు. మైము విద్యలో అంతర్జాతీయ ఖ్యాతి గడించిన డాక్టర్ మధు ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. విద్యార్థులకు ఈ మూకాభినయం ప్రాముఖ్యత, మెళకువలపై అవగాహన కల్పించారు. థియేటర్ ఆర్ట్స్ విభాగం ఆచార్య ఎల్‌వీ నాగభూషణరావు, నృత్య శాఖ అధ్యాపకుడు డాక్టర్ ఎం.కాశయ్య మూకాభినయ ఆవశ్యకతను తెలియజేశారు.



మైము గురించి విద్యార్థులకు తెలియజేస్తున్న అంతర్జాతీయ నటుడు మధు

శిల్పారామం.. కళా శోభితం

గుంటూరులో రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా నిర్మించిన శిల్పారామం జాతీయస్థాయి వస్త్ర వేదికగా మారింది. 2014 - 19కి మధ్య అప్పటి ప్రభుత్వం ప్రారంభిం చిన శిల్పారామం పోయిన ఐదేళ్లలో తీవ్ర నిరాదరణకు గురయింది. కూటమి ప్రభుత్వం రాకతో.. శిల్పారామం తిరిగి ప్రాణం పోసుకుంది. తాజాగా చేపట్టిన రాష్ట్రస్థాయి చేనేత మేళాతో జాతీయ స్థాయి వస్త్ర నిలయంగా నగర వాసులను ఆకట్టుకుంటోంది.

● రాష్ట్ర స్థాయి చేనేత ఉత్పత్తుల మేళా.. 'షీ'

● రాష్ట్రం నలుమూలల నుంచి భారీగా చేనేత ఉత్పత్తులు

● యూపీ, జార్ఖండ్, పశ్చిమ బెంగాల్, కశ్మీర్, తమిళనాడు నుంచి స్టాల్స్

● సెప్టెంబరు 2 వరకు ప్రదర్శన, అమ్మకాలు



శిల్పారామంలో ఏర్పాటు చేసిన స్టాల్స్

గుంటూరు, ఆగస్టు 25(ఆంధ్రజ్యోతి): భారత ప్రభుత్వ జౌళీ మంత్రిత్వ శాఖ సౌజన్యంతో ఆంధ్రప్రదేశ్ శిల్పారామం ఆర్ట్స్ క్రాఫ్ట్స్ అండ్ కల్చరల్ సొసైటీ రాష్ట్రస్థాయి వస్త్ర ప్రదర్శనను గుంటూరులోని శిల్పారామంలో నిర్వహిస్తోంది. నగరంలోని ఆర్డీవో కార్యాలయం దగ్గర ఉన్న శిల్పారామంలో స్టేట్ హ్యాండ్లూమ్ ఎగ్జిబిషన్ (షీ)- 2025 పేరుతో ఈ నెల 20న చేనేత మేళాను ప్రారంభించారు. ప్రతి రోజూ ఉదయం 11 నుంచి రాత్రి 9 గంటల వరకు జరుగుతున్న ఈ వస్త్ర ప్రదర్శనశాలకు మంచి స్పందన లభిస్తోంది. అలాగే సాంస్కృతిక కార్యక్రమాలు, నృత్య ప్రదర్శనలు ఇక్కడ నిర్వహిస్తున్నారు. గుంటూరు నగరం సహా చుట్టుపక్కల ప్రాంతాల నుంచి చేనేత వస్త్ర అభిమానులు వస్తున్నారు. చేనేత ఉత్పత్తులను తీసుకుంటున్నారు.

అందుబాటులో అనేక రాష్ట్రాల చేనేత వస్త్రాలు

చేనేత వస్త్ర ప్రదర్శనలో మంగళగిరి, వెంకటగిరి జరీ, చీరాల, మచిలీపట్నం, కడప, నారాయణపేట, ఉప్పాడ, ధర్మవరం, పోచంపల్లి, కుప్పడం శిల్క్స్, పొందూరు ఖాదీ, కడప కాటన్ ప్రింటెడ్ టవల్స్, లుంగీలు వంటి తెలుగు సంప్రదాయ చేనేత, పట్టు ఉత్పత్తులకు సంబంధించి పెద్ద సంఖ్యలో స్టాళ్ల ఏర్పాటు చేశారు. వీటితోపాటు కశ్మీరి శిల్క్, ఉత్తరప్రదేశ్ బెడ్‌షీట్స్, కాటన్ బెడ్ షీట్స్ దర్రీస్, భాగల్‌పూర్ ఛాదర్, శిల్క్ షర్టింగ్, మధురై చీరలు, శంబల్‌పరి ఇక్కత్ వంటి ఎన్నో రకాలు వస్త్రాలు అందుబాటులో ఉన్నాయి.





అటో ఇటో అయితే.. జీవితాలు ఎటో!

వరద ఉధృతిలోనూ తగ్గేదే లేదు! పడవలపై గాజుల్లంక - శ్రీకాకుళం రాకపోకలు



అరవింద వారధి వద్ద కొనసాగుతున్న వరద ప్రవాహం

కొల్లూరు, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి) : కృష్ణా నదిలో వరద ఉధృతి కొనసాగుతోంది. అయినా గాజుల్లంక - శ్రీకాకుళం పడవలపై ప్రయాణికుల రాకపోకలు కొనసాగుతున్నాయి. కొల్లూరు మండలం గాజుల్లంక వద్ద కృష్ణా నదిలో ప్రయాణికులు కృష్ణా జిల్లా శ్రీకాకుళానికి రాకపోకలు సాగిస్తుంటారు. పడవలపై ద్విచక్ర వాహనాలు కూడా అటు వైపు తీసుకెళ్తుంటారు. ఇటీవల కృష్ణా నదికి వరద పోటెత్తడంతో కొద్ది రోజులు పడవ ప్రయాణాన్ని నిలిపివేశారు. నదిలో కొంత వరద ప్రవాహం తగ్గిందని భావించిన పడవల నిర్వాహకులు ప్రయాణికులను, వాహనాలను నది దాటిస్తున్నారు. కానీ, పడవల్లో కనీస భద్రతా ప్రమాణాలు పాటించడం లేదు. కనీసం లైఫ్ జాకెట్‌లు కూడా అందుబాటులో లేవు. ఆదివారం కృష్ణా నదిలో వరద ఉధృతి 3.90 లక్షల క్యూసెక్కులు కాగా.. సోమవారం ఉదయం 3,24,600 క్యూసెక్కులుగా ఉంది. దీనిపై తహసీల్దార్ బి. వెంకటేశ్వర్లును వివరణ కోరగా.. వరద ప్రవాహంలో పడవల రాకపోకలను నిషేధిస్తామన్నారు. పోలీసు, మత్స్యశాఖల అధికారులకు కూడా సూచిస్తామన్నారు.



గాజుల్లంక వద్ద వరద ఉధృతిలో శ్రీకాకుళం వెళ్లేందుకు పడవ ఎక్కుతున్న ప్రయాణికులు

30, 31 తేదీల్లో ఐఎల్‌ఏ రాష్ట్ర సదస్సు

● రాష్ట్ర అధ్యక్షుడు శాంతకుమార్

గుంటూరు(లీగల్), ఆగస్టు 15(ఆంధ్రజ్యోతి):స్థానిక వెంకటేశ్వర విజ్ఞాన మందిరంలో ఇండియన్ లాయర్స్ అసోసియేషన్ రాష్ట్రస్థాయి సదస్సు ఈ నెల 30, 31 తేదీల్లో నిర్వహిస్తున్నట్లు అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు జీ శాంతకుమార్ పేర్కొన్నారు. స్థానిక అరండల్‌పేటలోని ఐఎల్‌ఏ రాష్ట్ర కార్యాలయంలో సోమవారం సదస్సు ఆహ్వాన గోడ ప్రతులను ఆవిష్కరించి, వివరాలను వెల్లడించారు. న్యాయవాదులకు ఉచిత బీమా కార్డులు, జూనియర్ న్యాయవాదులకు ఐదేళ్ల పాటు నెలకు రూ.10 వేల స్థయిఫండ్, ఇళ్ల స్థలాలు, మరణించిన న్యాయవాదులకు రాష్ట్ర ప్రభుత్వం చెల్లించాల్సిన రూ.4 లక్షల మ్యాచింగ్ గ్రాంట్, డెత్ బెనిఫిట్ రూ.10 లక్షలకు పెంచేందుకు రాష్ట్ర బార్ కౌన్సిల్ ద్వారా ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావడం. తదితర అంశాలపై రెండు రోజుల సదస్సులో చర్చిస్తామన్నారు. ముఖ్య అతిథిగా మధ్యప్రదేశ్ హైకోర్టు విశ్రాంత చీఫ్ జస్టిస్ సురేష్ కుమార్ కైట్, గౌరవ అతిథులుగా ఏపీ హైకోర్టు విశ్రాంత న్యాయమూర్తులు జస్టిస్ కేసీ భాను, జస్టిస్ జి.శ్యాంప్రసాద్, డాక్టర్ ఎన్.జేసు రత్నకుమార్, జిల్లా ప్రిన్సిపల్ డిస్ట్రిక్ట్ సెషన్ జడ్జి బి.సాయి కళ్యాణ్ చక్రవర్తి, పార్లమెంట్ సభ్యుడు డాక్టర్ టీ తిరుమలన్, ఐఎల్‌ఏ తెలంగాణ రాష్ట్ర కన్వీనర్ డాక్టర్ బి.కార్తీక్ నవ్యాన్, సీనియర్ న్యాయవాదులు రవివర్మ కుమార్, ఎ.సత్యప్రసాద్ ఇతర ప్రముఖులు పాల్గొని అనేక విషయాలపై చర్చిస్తారని చెప్పారు. ఐఎల్‌ఏ వ్యవస్థాపకులు శ్రీకాంత్, రాష్ట్ర నాయకులు నరసింహుడు, జిల్లా అధ్యక్షురాలు గీతవాణి, నగర అధ్యక్షుడు కాలేషా బేగ్, న్యాయవాదులు బండారు సాయిబాబు, ఆనంద్ పాల్గొన్నారు.



పోస్టర్లు ఆవిష్కరిస్తున్న ఇండియన్ లాయర్స్ అసోసియేషన్ సభ్యులు

ఇదేం పంచాయితీ!

(5వ పేజీ తరువాయి)

ఆదేశించింది.

ప్రభుత్వం చెప్పింది కేవలం 5 శాతమే..

స్వర్ణ పంచాయతీ కార్యక్రమం ప్రవేశ పెట్టే సందర్భంగా పంచాయతీ కార్య దర్శులకు ప్రభుత్వం శిక్షణ తరగతులు ఏర్పాటు చేస్తే బాగుండేది అన్న భావన సర్వత్రా వ్యక్తమవుతోంది. కేవలం పుస్త కాలు ఇచ్చి వాటి ప్రకారం చేయాలని చెప్పడంతో.. కొందరు వాటిని వేరే రకం గా అర్థం చేసుకున్నారు. గతంలో ఉన్న జీవో ప్రకారం ఏటా పంచాయతీలు 5 శాతం పన్ను పెంచుకునే అవకాశం ఉం ది. ఆస్తి విలువను బట్టి వంద రూపా యలకు 12 పైసల నుంచి రూపాయి వరకు పన్ను విధించాలి. ఆస్తి విలువ సుమారు రూ. 2 లక్షలు ఉంటే రూ. 220 నుంచి రూ.250 వరకు ఇంటి పన్ను విధించాలి. దానికి అదనంగా లైబ్రరీ సెస్సు 8, ఫైర్ సెస్సు ఒక శాతం, క్రీడల సెస్సు 3, డ్రెయినేజీ సెస్సు, వీధి లైట్ల సెస్సు, నీటి సరఫరా సెస్సు విధించవచ్చు. అంతా కలిపినా రూ. 300 నుంచి రూ.350 వరకు ఇంటి పన్ను వస్తుంది. ప్రస్తుతం పన్ను పెంపునకు గతేడాది డిమాండ్‌ను పరిగణలోకి తీసుకు న్నారు. దాని మీద 5 శాతం పెంచుతున్నారు. స్వర్ణ పంచాయతీ పేరుతో కొందరు పంచాయతీ కార్యదర్శులు అందుకు భిన్నంగా పన్ను పెంచడంతో వందల్లో ఉన్న పన్ను రూ.వేలల్లోకి వెళ్లింది.

పెరుగుదలకు బ్రేకులు..

అసంబద్ధంగా ఇంటి పన్ను పెరిగిన చోట అసెస్మెంట్‌ల ఆన్‌లైన్ ప్రక్రియకు జిల్లా అధికారులు బ్రేకులు వేశారు. కొందరు పంచా యతీ కార్యదర్శులు జీవోను అతిక్రమించి పన్ను పెంచేశారని ఆరో పణలున్నాయి. 10 శాతం కూడా పెంచేశారని పలువురు అధికా రులు చెబుతున్నారు. అటువంటి చోట తిరిగి సమీక్ష నిర్వహించిన తర్వాత ఆన్‌లైన్ ప్రక్రియ కొనసాగుతుందని చెబుతున్నారు. ఆ ప్రక్రియ పూర్తయితేనే పెండింగ్‌లో ఉన్న ఇంటి పన్ను వసూలు చేసే అవకాశం లేదని కొందరు చెబుతున్నారు.

తల్లిదండ్రుల ఆశా జ్యోతి



చదువుకుంటూ, కూలి పనులకెళ్తూనే డీఎస్సీ కొలువు

పెదకూరపాడు, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): మెగా డీఎస్సీలో తొలి ప్రయత్నం లోనే ఉపాధ్యాయ కొలువు సాధించింది ఆశా జ్యోతి. ఈ సాధన వెనుక పెద్ద కష్టమే ఉంది. పెదకూరపాడు మండలంలోని జలాలపురం ఆమె స్వగ్రా మం. తల్లిదండ్రులు మన్నవ చిన్నప్ప, లూర్దుమేరి. ముగ్గురు కుమార్తెల సం తానంలో.. ప్రథమ కుమార్తె ఆశాజ్యోతి. సైన్స్ విభాగంలో రాసిన మూడు పేప ర్లలో స్కూల్ అసిస్టెంట్ బయాలజికల్ సైన్స్‌లో 12, టీజీటీ సైన్స్‌లో 15, టీజీటీ బయాలజికల్ సైన్స్‌లో 18వ ర్యాంకులు సాధించింది. తల్లిదండ్రులు కూలీ పనులు చేసుకుంటూ తమ ముగ్గురు కుమార్తెలను చదివిస్తున్నారు. గు రుకుల పాఠశాలలో విద్యనభ్యసించిన ఆశా జ్యోతి.. సెలవు రోజుల్లో కూలీ ప నులకు వెళ్తూ తల్లిదండ్రులకు చేదోడు వాదోడుగా నిలిచింది. తల్లిదండ్రుల ప్రోత్సాహం వల్లే తాను తొలి ప్రయత్నంలోనే ఉపాధ్యాయ కొలువు సాధించిన ట్లు ఆశా జ్యోతి ఆంధ్రజ్యోతికి తెలిపింది. ఆమె ఇద్దరు చెల్లెళ్ల ఒకరు ఇంజనీరింగ్, మరొకరు ఇంటర్ చదువుతున్నారు. కష్టపడి చదవడం వల్లే ఉపాధ్యా య కొలువుకు ఎంపికయ్యావని పలువురు ఆమెను అభినందిస్తున్నారు.

ఉపాధి కూలీనే..ఉపాధ్యాయుడు

తాడికొండ, ఆగస్టు 25(ఆంధ్రజ్యోతి): ఉపాధి హామీ పథకంలో కూలి పని చేస్తూ.. ప్రభుత్వ ఉపాధ్యాయుడిగా ఉద్యోగం పొందడం అందరికి ఆదర్శనీయమని గెజిటెడ్ అధికారుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వినుకొండ రాజారావు పేర్కొన్నారు. తాడికొండ గ్రామంలో ఉపాధి హామీ పథకం కూలిగా పనిచేస్తూ.. డీఎస్సీలో 78.32 మార్కులు సాధించిన సూర్య ప్రకాష్‌ను సన్మానించారు. రాజారావు మాట్లాడుతూ అనారోగ్యంతో తండ్రి మరణించినా, వృద్ధాప్యంలో ఉన్న తల్లిని పోషించుకుంటూ డీఎస్సీ సెలక్షన్‌లో సూర్య ప్రకాష్ డీఎస్సీలో మంచి మార్కులు సాధించడం అభినందనీయమన్నారు.



సూర్య ప్రకాష్‌ను అభినందిస్తున్న గెజిటెడ్ అధికారులు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు రాజారావు

ప్రభుత్వాసుపత్రుల్లో.. ఆన్‌లైన్ ఓపీ

● ముందుగా ఏరియా వైద్యశాలల్లో

● భవిష్యత్‌లో ప్రిస్క్రిప్షన్, ల్యాబ్ రిపోర్టులు ఆన్‌లైన్‌లో



ఏరియా వైద్యశాలకు వచ్చిన రోగులు



ఏరియా ఆస్పత్రి సత్తెనపల్లి

సత్తెనపల్లి, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి) : ఉమ్మడి జిల్లాలోని ఏరియా ప్రభుత్వ వైద్యశాలలో రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు ప్రభుత్వం ఆన్‌లైన్ విధానం తీసుకు వస్తున్నారు. దీనికి సం బంధించి ఏర్పాట్లు చురుగ్గా జరుగుతున్నాయి. భవిష్యత్‌లో కార్పొరేట్ స్థాయిలో ప్రిస్క్రిప్షన్, లేబ్ రిపోర్టు ఇతర వివరాలన్నీ ఆన్‌లైన్‌లో జారీ చేసేందుకు ప్రభుత్వం ఏర్పాట్లు చేస్తుంది. ఆన్‌లైన్ విధానం కోసం సెకండరీ హెల్త్ డైరెక్టరేట్ నుంచి ఏరియా వైద్యశాలకు కంప్యూటర్లు కూడా కేటాయించింది. రోగుల ఆరోగ్య స్థితి గతులను ఆన్‌లైన్ విధానంలో ట్రాక్ చేసేందుకు ఈ నూతన విధానం అమల్లోకి తీసుకు వచ్చారు. ఆస్పత్రికి వచ్చిన రోగులను అభ వెబ్‌సైట్‌లో రిజిస్ట్రేషన్ చేస్తారు. ఆసుపత్రికి వచ్చినవారందరూ ముందుగా ఓపీ చీటి తీసుకోవాల్సి వస్తుంది. ఈ నేపథ్యంలో రోగి వ్యక్తి గత సమాచారం, ఫోన్ నెంబరు ఆన్‌లైన్‌లో నమోదు చేస్తే వెంటనే ఓటీపీ వస్తుంది. ఈ ఓటీపీని నమోదు చేస్తే రిజిస్ట్రేషన్ నెంబరు జనరేట్ అవుతుంది. వైద్యాధికారి రిజిస్ట్రేషన్ నెంబరు కంప్యూటర్‌లో నమోదు చేసి రోగిని పరీక్షించి ఆన్‌లైన్‌లో మందుల వివరాలు నమోదు చేస్తారు. ఈ మందుల వివరాలు ఫార్మాసిస్ట్‌కు వెళ్తాయి. రోగి రిజిస్ట్రేషన్ నెంబరు ఆధారంగా ఫార్మాసిస్టు వైద్యాధికారి సూచించిన మందులు అందజేశారు. అలాగే రక్త పరీక్షలు, ఇతర పరీక్షలు ఉన్న రిజిస్ట్రేషన్ నెంబరు ఆధారంగానే ఆన్‌లైన్ విధానం ద్వారా రిపోర్టులు రోగి ఎప్పుడు ఆస్పత్రికి వచ్చినా, ముందు వైద్యుల నుంచి పొందిన చికిత్స, మందుల ప్రిస్క్రిప్షన్, ల్యాబ్ రిపోర్టులు ఆన్‌లైన్‌లో కన్పిస్తాయి. దీంతో రోగికి చికిత్స అందించటం సులభమవుతుంది. రోగి తన వెంట ఓపీ చీటి, రిపోర్టులు తీసుకొని వెళ్ళాల్సిన అవసరం ఉండదు. రోగి ప్రిస్క్రిప్షన్, ల్యాబ్ రిపోర్టులు, రిజిస్ట్రేషన్ నెంబరు ఆధారంగా హార్డ్ కాపీలు తీసుకోవచ్చు. ఈ ఆన్‌లైన్ విధానం మరి కొద్ది నెలల్లో పూర్తి స్థాయిలో రోగులకు అందుబాటులోకి వస్తుందని వైద్యులు చెపుతున్నారు. ప్రస్తుతం ఓపీకి మాత్రమే ఆన్‌లైన్ విధానం అమలు చేస్తున్నారు. ఇది అమలులోకి వస్తే ఏరియా ఆసుపత్రులకు చికిత్స కోసం వచ్చే రోగులు ఫోన్ కచ్చితంగా తీసుకు రావాల్సిందే.

పట్టువదలని విక్రమార్కుడు.. జాన్ డేనియల్

● 17 ఏళ్లు, ఐదవ ప్రయత్నంలో ఉపాధ్యాయ ఉద్యోగం



జాన్ డేనియల్‌ను సత్కరిస్తున్న ఏఈఎల్‌సీ చర్చి యాజమాన్యం

క్రోసూరు, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): క్రోసూరుకు చెందిన కంభంపాటి జాన్ డేనియల్ పట్టువదలని విక్రమార్కుడిలా సుమారు 17 సంవత్సరాల నుంచి ఉపాధ్యాయ ఉద్యోగం కోసం ప్రయత్నిస్తూనే ఉన్నాడు. మెగా డీఎస్సీలో ఎట్టకేలకు విజయం సాధించాడు. 2008 డీఎస్సీ నుంచి వరుసగా 2012, 2014, 2018లో డేనియల్ వరుస ప్రయత్నాలు చేశారు. బీసీ(సీ) క్యాటగిరికి చెందిన జాన్ ఒక మార్కు, రెండు మార్కులతో అవకాశాన్ని కోల్పోతూ వచ్చినా.. ఓర్పు, సహనాన్ని కోల్పోలేదు. హిందీ స్కూల్ అసిస్టెంట్, హిందీ టీజీటీ పోస్టులు రెండింటిలోనూ విజయం సాధించినట్లు తెలిపారు. ఆయనతో పాటు ప్రయత్నించి ఇప్పటికే ఉద్యోగం పొందిన ఉపాధ్యాయులు అభినందనలు తెలిపారు. క్రోసూరులోని ఏఈఎల్‌సీ చర్చి యాజమాన్యం సోమవారం ఆయనను ఘనంగా సత్కరించింది. ఉద్యోగం సాధించిన మరొక అభ్యర్థి శామ్యూల్ మోరీస్‌ను కూడా సన్మానించారు. వీరి ఉద్యోగ జీవితం సంతోషంగా సమర్థంగా జరగాలని చర్చి పాస్టర్ మాచర్ల సుందరరావు ఆకాంక్షించారు.

పల్నాడు వార్తలు

◆ నరసరావుపేట ◆ వినుకొండ ◆ చిలకలూరిపేట

చిలకలూరిపేట టీడీపీ అనుబంధ కమిటీల ఎన్నిక ఏకగ్రీవం

చిలకలూరిపేట, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): టీడీపీ వాణిజ్య విభాగం, ఐటీడీపీ కమిటీల ఎన్నికలు ఏకగ్రీవంగా సోమవారం జరిగాయి. నియోజకవర్గ వాణిజ్య విభాగం కమిటీ అధ్యక్షుడిగా అర్వపల్లి వీరాంజనేయులు, ప్రధాన కార్యదర్శిగా తవ్వా నాగమల్లేశ్వరరావు, పట్టణ వాణిజ్య విభాగం కమిటీ అధ్యక్షుడిగా కొలిశెట్టి రంగనాథ్, ప్రధాన కార్యదర్శిగా ఊటుకూరి చంద్ర ఎన్నికయ్యారు. చిలకలూరిపేట మండల ఐటీడీపీ కమిటీ అధ్యక్షుడిగా నెల్లూరి రేవంత్, ప్రధాన కార్యదర్శిగా షేక్ సలీం మాలిక్ ఎన్నికయ్యారు.

ప్రత్యేక అవసరాలు గల వారికి సమాన అవకాశాలు కల్పించాలి

● నరసరావుపేట ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు

నరసరావుపేట రూరల్, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): ప్రత్యేక అవసరాలు కలిగిన విద్యార్థులకు సమాజంలో సమాన అవకాశాలు కల్పించడం మనందరి బాధ్యత అని నరసరావుపేట ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు తెలిపారు. పాఠశాల విద్యాశాఖ - సమగ్ర శిక్ష సహకారంతో పల్నాడు జిల్లా విద్యా విభాగం ఆధ్వర్యంలో నరసరావుపేట నియోజకవర్గంలోని లింగంగుంట్లలోని జిల్లా పరిషత్ హైస్కూల్, శంకరభారతిపురంలో ప్రత్యేక అవసరాల విద్యార్థుల కోసం ఉచిత ఉపకరణాల నిర్ధారణ శిబిరం సోమవారం నిర్వహించారు. కార్యక్రమంలో నరసరావుపేట ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడుతూ ప్రత్యేక అవసరాలు కలిగిన విద్యార్థులకు అవసరమైన ఉపకరణాల పంపిణీకి నిర్ధారణ చేయడం జరిగిందన్నారు. త్వరలో విద్యార్థులకు ఉపకరణాలు పంపిణీ చేయనున్నట్లు అధికారులు తెలిపారు. కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖ అధికారులు, పాఠశాల ఉపాధ్యాయులు, వైద్య నిపుణులు, స్థానిక ప్రజాప్రతినిధులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.



ప్రత్యేక అవసరాలు కలిగిన చిన్నారులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు

పెండింగ్‌లో ఉన్న డీఏ బకాయిలు చెల్లించాలి

● పల్నాడు జిల్లా రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్ల సంఘం తీర్మానం

నరసరావుపేట టౌన్, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): పెండింగ్‌లో ఉన్న డీఏ అరియర్స్, ఇతర బకాయిలు చెల్లించాలని పల్నాడు జిల్లా రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్ల సంఘం తీర్మానం చేసింది. సోమవారం నరసరావుపేట పెన్షనర్లు సంఘ భవనంలో పల్నాడు జిల్లా రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్ల సంఘం శాఖ ఆగస్టు నెల కార్యవర్గ సమావేశం జరిగింది. సమావేశానికి సంఘం అధ్యక్షుడు మానం సుబ్బారావు అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా త్వరలో జరగనున్న మంత్రివర్గ సమావేశంలో తమ డిమాండ్ల చర్చించాలని తీర్మానించారు. కార్యక్రమంలో సంఘం గౌరవాధ్యక్షుడు లంకా రంగనాయకులు, సెక్రటరీ సీనీ ఆదెయ్య, అసోసియేట్ ప్రెసిడెంట్ కంచుపర్తి సత్యనారాయణ, ట్రెజరర్ ఎంఎ్ ఎఆర్‌కే ప్రసాద్, ఆర్గనైజింగ్ సెక్రటరీ కేవీ చలపతిరావు, జాయింట్ సెక్రటరీ పచ్చల నాగభూషణం, అంబటి మాధవరెడ్డి, రెబ్బా ఆంజనేయులు, దాసరి రాజేశ్వరరావు, షేక్ హుస్సేన్, రంగోజీరావు, ఎనిమిది తాలుకాల నుంచి ప్రెసిడెంట్‌లు, సెక్రటరీలు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న పల్నాడు జిల్లా రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్ల సంఘం నాయకులు

బ్రహ్మకుమారి సమాజం ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం

వినుకొండ టౌన్, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): రాజయోగిని ప్రకాశమణి దాది 18వ వర్ధంతి సందర్భంగా బ్రహ్మకుమారి సమాజం ఆధ్వర్యంలో వినుకొండలో రాధా డిగ్రీ కాలేజీ సౌజన్యంతో సోమవారం రక్తదానం శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా పీవీ సురేష్‌బాబు 92వసారి రక్తదానం చేశారు. కార్యక్రమంలో విద్యార్థులు, మానవసేవ సమితి సభ్యులు 50మంది రక్తదానం చేశారు. కార్యక్రమంలో రెడ్‌క్రాస్ సొసైటీ చైర్మన్ బెల్లంకొండ ప్రసాద్, రాధా డిగ్రీ కాలేజీ డైరెక్టర్ కె.రాధాకృష్ణ, గుంటి ఆంజనేయస్వామి దేవస్థానం చైర్మన్ చిలంకూరి కోటేశ్వరరావు, బ్రహ్మకుమారి సమాజం నిర్వాహకులు టీకే రాధిక, టీకే రమాదుర్గ, సంస్థ సభ్యులు పాల్గొన్నారు.



రక్తదానం చేస్తున్న యువకులు, విద్యార్థులు

దివ్యాంగులకు పింఛన్లు కోతలు లేకుండా ఇవ్వాలి

● వైసీపీ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ గోపిరెడ్డి

నరసరావుపేట రూరల్, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): దివ్యాంగులకు పింఛన్లు కోతలు లేకుండా ఇవ్వాలని వైసీపీ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి డిమాండ్ చేశారు. వైఎస్ జగన్మోహన్‌రెడ్డి పిలుపుమేరకు పల్నాడు జిల్లా వైసీపీ ఆధ్వర్యంలో వికలాంగుల పింఛన్ల తగ్గింపుపై కూటమి ప్రభుత్వ విధానాలపై నిరసన తెలిపి సోమవారం కలెక్టరుకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం వచ్చిన 14 నెలల్లో సుమారు 5 లక్షల మంది దివ్యాంగులు, ఇతర పింఛన్లు తీసివేయటం దారుణమన్నారు. ఈ కార్యక్రమంలో సత్తెనపల్లి నియోజకవర్గ సమన్వయకర్త గజ్జల సుధీర్ భార్గవరెడ్డి, పల్నాడు జిల్లా దివ్యాంగుల విభాగం అధ్యక్షుడు షేక్ అహ్మద్ (గోరే), నరసరావుపేట వైసీపీ పట్టణ అధ్యక్షుడు షేక్ కరీ ముల్లా తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న వైసీపీ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి

వజ్రగిరి జెస్టిస్ చిత్రానికి ప్రత్యేక ప్రశంస

వినుకొండ, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): ఫోరం ఫర్ ఆర్టిస్ట్స్ విజయవాడ వారు రాష్ట్ర స్థాయిలో 'శ్రమైక జీవనం' అనే అంశంపై విజయవాడ మాకినేని బసవపున్నయ్య భవన్‌లో ఆదివారం నిర్వహించిన చిత్రకళా ప్రదర్శనలో వినుకొండకు చెందిన చిత్రకారుడు డాక్టర్ వజ్రగిరి జెస్టిస్ గీసిన చిత్రం ప్రశంసలందుకుంది. ఈ సందర్భంగా నిర్వాహకులు సునీల్ అనుమకొండ, శేష బ్రహ్మం, గుండు నారాయణ తదితరులు జెస్టిస్‌ను సత్కరించారు.



వజ్రగిరి జెస్టిస్ చిత్రించిన చర్మకారులు చిత్రం

అర్జీల పరిష్కారమే లక్ష్యంగా చర్యలు తీసుకోవాలి

● కలెక్టర్ అరుణ్‌బాబు



ప్రజల నుంచి అర్జీలు స్వీకరిస్తున్న కలెక్టర్ అరుణ్‌బాబు, ఇతర అధికారులు

నరసరావుపేట టౌన్, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్)లో అందిన అర్జీల సత్వర పరిష్కారమే లక్ష్యంగా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ పీ అరుణ్‌బాబు అధికారులను ఆదేశించారు. సోమవారం నరసరావుపేటలోని కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్)ద్వారా జిల్లా నలుమూలల నుంచి వచ్చిన అర్జీలను స్వీకరించారు. పీజీఆర్ఎస్‌లో 146 అర్జీలు అందాయి. ఈ సందర్భంగా కలెక్టర్ అరుణ్‌బాబు మాట్లాడుతూ అర్జీల పరిష్కారంలో ఎటువంటి జాప్యానికి తావులేకుండా పరిష్కరించాలన్నారు. అర్జీలు పునరావృతం కాకుండా పరిష్కార చర్యలు ఉండాలన్నారు. సమస్యలు తమ పరిధిలోనివి కానప్పుడు వెంటనే సంబంధిత శాఖకు పరిష్కారం కోసం పంపాలని అధికారులకు కలెక్టర్ సూచించారు. కార్యక్రమంలో కలెక్టర్‌తోపాటు జిల్లా రెవెన్యూ అధికారి మురళి, ఇతర జిల్లా అధికారులు పాల్గొన్నారు.

పేద కళాకారులను ఆదుకోవాలని వినతి

వినుకొండ టౌన్, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): పేద కళాకారులను ఆదుకోవాలని హరికథ భాగవతారిణి అర్జీని తహసీల్దార్ సురేష్‌నాయక్‌కు అందజేశారు. సోమవారం జరిగిన గ్రీవెన్స్‌లో హరికథలు చెప్పుకుంటూ జీవనం సాగిస్తున్న హరికథ భాగవతారిణి సిద్దు నాగమల్లేశ్వరి హరికథలకు ఆదరణ లేక జీవన భృతి కష్టంగా ఉందన్నారు. తమకు నివాస గృహం మంజూరు చేయాలని గుమ్మడి కళా పీఠం వ్యవస్థాపకుడు గుమ్మడి వెంకటేశ్వర్లుతో కలిసి తహసీల్దార్ సురేష్‌నాయక్‌కు అర్జీ అందజేశారు. తహసీల్దార్ స్పందిస్తూ ఇల్లు లేని వారు సచివాలయం ద్వారా దరఖాస్తు చేసుకోవాలన్నారు.



వినుకొండ తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న కళాకారులు



అర్జీదారులకు భోజనం వడ్డిస్తున్న ఎస్పీ కంచి శ్రీనివాసరావు

ప్రజా సమస్యల పరిష్కార వేదికకు 120 ఫిర్యాదులు

నరసరావుపేట లీగల్, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): ప్రతి సోమవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో నిర్వహించే ప్రజా సమస్యల పరిష్కార వేదికను ఎస్పీ ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించారు. ప్రజల వద్ద నుంచి వివిధ అంశాలకు సంబంధించి 120 ఫిర్యాదులను ఎస్పీ కంచి శ్రీనివాసరావు స్వీకరించారు. యడ్లపాడు మండలం కొండవీడుకు చెందిన దాసు అతని తమ్ముడు బాబులను ఫిరంగిపురంనకు చెందిన బాజీ, బాబుసింగ్ బాబు ఉద్యోగం ఇప్పిస్తామని నగదు తీసుకొని మోసం చేశారని ఫిర్యాదు చేశారు. నరసరావుపేటకు చెందిన సమీవుల్లా ఈ ఏడాది జూన్ 3న ఏటీఎంలో నగదు డ్రా చేస్తుండగా గుర్తు తెలియని వ్యక్తి మోసగించి ఏటీఎం కార్డు తీసుకుని అక్రమంగా నగదును డ్రా చేసుకున్నాడని ఫిర్యాదు చేశారు. పట్టణంలోని ప్రకాష్ నగర్‌కు చెందిన జ్యోతి అనే ఆమెకు వ్యాపారంలో భాగస్వామ్యం ఇస్తానని చెప్పి నర్సరావుపేటకు చెందిన వెంకటేశ్వరరెడ్డి నగదు తీసుకొని మోసం చేశాడ ఫిర్యాదు చేశారు. అర్జీదారులకు ఎస్పీ స్వయంగా భోజనం వడ్డించారు. కార్యక్రమంలో పరిపాలన అదనపు ఎస్పీ సంతోష్, మహిళా పోలీస్ స్టేషన్ డీఎస్పీ వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

మల్లమ్మ సెంటర్‌లో చోరీ

నరసరావుపేట లీగల్, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో అత్యంత రద్దీగా ఉండే మల్లమ్మ సెంటర్లో సోమవారం తెల్లవారుజామున గుర్తు తెలియని వ్యక్తి బేకరీ షాపులో ప్రవేశించి లక్షన్నర రూపాయల నగదు చోరీ చేశాడు. సీసీ టీవీ పుటేజ్‌లో ఓ యువకుడు షాపు షట్టర్ పగలగొట్టి లోనికి ప్రవేశించి నగదు తీసుకు వెళుతున్న దృశ్యాలు కనిపించాయి. షాపు యజమాని హర్షవర్ధన్ చోరీ సంఘటనపై పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు మొదటి పట్టణ ఎస్ఐ పి.వంశీకృష్ణ తెలిపారు.

ఎరువుల రైల్వే పాయింట్‌లో అధికారుల తనిఖీ

నరసరావుపేట రూరల్, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): పల్నాడు జిల్లాలో అన్ని ప్రాంతాలకు సక్రమంగా ఎరువులను సరఫరా చేయాలని జిల్లా వ్యవసాయ అధికారి ఎం.జగ్గారావు అధికారులను ఆదేశించారు. జిల్లాలోని సాతులూరులోని ఎరువుల రైల్వే రేకు పాయింట్‌ను జిల్లా వ్యవసాయ అధికారి ఎం.జగ్గారావు సోమవారం తనిఖీ చేశారు. రికార్డులను తనిఖీ చేశారు. జిల్లాలోని అన్ని ప్రాంతాలకు సమానంగా ఎరువులను సరఫరా చేయాలని అధికారులను ఆదేశించారు.



సాతులూరు రైల్వే పాయింట్‌లో ఎరువులను తనిఖీ చేస్తున్న జిల్లా వ్యవసాయ అధికారి ఎం.జగ్గారావు

స్వమిత్వ సర్వేను సమర్థవంతంగా పూర్తి చేయాలి

నూజెండ్ల, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): మండలంలో చేపట్టిన స్వమిత్వ సర్వేను త్వరితగతిన పూర్తిచేయాలని ఎంపీడీవో పీ ఉమాదేవి అన్నారు. ఎంపీడీవో కార్యాలయంలో సోమవారం స్వమిత్వ సర్వేపై పంచాయతీ కార్యదర్శులు, గ్రామ సర్వేయర్లు, ఇంజనీరింగ్ అసిస్టెంట్‌లతో సమీక్ష నిర్వహించారు. కార్యక్రమంలో డిప్యూటీ ఎంపీడీవో ఎస్.సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

ఎరువుల దుకాణాల్లో తనిఖీ

నూజెండ్ల, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఎరువుల దుకాణాలను అధికారులు సోమవారం తనిఖీ నిర్వహించారు. మండల కేంద్రం నూజెండ్ల, రవ్వారం, ముప్పరాజువారిపాలెం తదితర గ్రామాల్లోని ఎరువుల దుకాణాలను తహసీల్దార్ జీ రమేష్ కుమార్, ఏవో ఆంజనేయులు నాయక్, ఐనవోలు ఎస్ఐ బీవీ కృష్ణారావులు ఆకస్మికంగా తనిఖీలు నిర్వహించారు. స్టాక్ రిజిస్టర్లను పరిశీలించి గోదాముల్లోని ఎరువులను పరిశీలించారు. కార్యక్రమంలో ఏఈవో ఎలీషా, విలేజ్ అగ్రికల్చర్ అసిస్టెంట్‌లు ఉన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి తీవ్ర గాయాలు

నూజెండ్ల, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): ద్విచక్ర వాహనాన్ని ట్రాక్టర్ ఢీకొట్టిన సంఘటనలో ఒక వ్యక్తికి తీవ్రగాయాలైన సంఘటన మండలంలోని చింతలచెరువు రైల్వే అండర్ పాసు వంతెన వద్ద సోమవారం సాయంత్రం జరిగింది. వినుకొండ మండలం శ్రీరాంపురంనకు చెందిన ఎం.అంజిరెడ్డి ద్విచక్ర వాహనంపై దర్శి వెళ్తుండగా ఎదురుగా వస్తున్న ట్రాక్టర్ ఢీకొనటంతో తీవ్రగాయాలయ్యాయి. క్షతగాత్రుడు వినుకొండ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు.

గుర్తు తెలియని మహిళ మృతి

వినుకొండ టౌన్, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని కాశినాయన ఆశ్రమ సమీపంలో కొన్నేళ్లుగా అనారోగ్యంతో ఉన్న గుర్తు తెలియని మహిళ సోమవారం మృతి చెందింది. పోలీసులు మృతదేహాన్ని వినుకొండ ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు.

నేత్రదాన ప్రాముఖ్యంపై అవగాహన

నరసరావుపేట లీగల్, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): నేత్రదాన ప్రాముఖ్యంపై జిల్లాలోని అన్ని గ్రామాల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు డీఎంహెచ్‌వో డాక్టర్ రవి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. జాతీయ నేత్రదాన పక్షోత్సవంలో భాగంగా ఈ నెల 25 నుంచి సెప్టెంబరు 8 వరకు ఈ కార్యక్రమం నిర్వహిస్తామన్నారు. కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో ఏర్పాటుచేసిన కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న జిల్లా కలెక్టర్ అరుణ్ బాబు నేత్రదానం ప్రాముఖ్యతపై గోడపత్రిక ఆవిష్కరించారు. జిల్లా అంధ్ర నివారణ అధికారి డాక్టర్ భువనేశ్వరి మరణించిన వ్యక్తి నేత్రాలను సురక్షితంగా వేరే వ్యక్తులకు అమర్చే విధానాన్ని వివరించారు. కార్యక్రమంలో డాక్టర్ ప్రసూన, డాక్టర్ చంద్రశేఖర్, రామకృష్ణ తదితర వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

మద్యం మత్తులో వాహనాలు నడిపిన వారికి జరిమానా

నరసరావుపేట లీగల్, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): మద్యంసేవించి వాహనాలు నడిపిన 9మంది వ్యక్తులకు ఒక్కొక్కరికి 10,000 జరిమానా విధిస్తూ స్థానిక ద్వితీయ శ్రేణి ప్రత్యేక న్యాయస్థానం ఇన్చార్జి న్యాయాధికారి, మొదటి అదనపు జూనియర్ సివిల్ న్యాయధికారి ఆవుల సలోమి సోమవారం తీర్పు వెలువరించారు. రూరల్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఇటీవల వివిధ ప్రాంతాల్లో నిర్వహించిన తనిఖీలలో 9మంది వ్యక్తులు మద్యంసేవించి వాహనం నడుపుతూ పోలీసులకు పట్టుబడ్డారు. వారిని సోమవారం న్యాయాధికారి ఎదుట హాజరుపర్చగా పైవిధంగా తీర్పు వెలువరించారు.

శాంతియుతంగా పండుగను జరుపుకోవాలి : ఎస్ఐ

యడ్లపాడు, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): వినాయక చవితి పండుగను ప్రజలు శాంతియుతమైన వాతావరణంలో ఆనందంగా జరుపుకోవాలని యడ్లపాడు ఎస్ఐ టి.శివరామకృష్ణ సూచించారు. సోమవారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ మండపాల ఏర్పాటుకు ముందస్తు అనుమతులు తీసుకోవాలని, ట్రాఫిక్‌కు ఎలాంటి అంతరాయం లేని విధంగా మండపాలు పెట్టుకోవాలన్నారు. నిమజ్జనంను పోలీసుల పర్యవేక్షణలో, నిర్దేశించిన మార్గాల్లో, ఇచ్చిన సమయంలో మాత్రమే నిర్వహించాలన్నారు. సోషల్ మీడియాలో విద్వేషాలను రెచ్చగొట్టేలా పోస్టులు పెట్టడం వంటి చర్యలకు పాల్పడవద్దని, అలా ఎవరైనా పోస్టులు పెడితే వెంటనే పోలీసులకు తెలియచేయాలన్నారు. ఉత్సవ కమిటీలు, ప్రజలు పోలీసులతో సహకరించాలని ఎస్ఐ కోరారు.

అంగన్‌వాడీ కేంద్రానికి బీరువా బహూకరణ

రొంపిచర్ల, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రొంపిచర్ల గ్రామంలోని నాల్గో అంగన్‌వాడీ కేంద్రానికి కొమ్మారెడ్డి రామిరెడ్డి రూ 6,500 విలువ చేసే బీరువాను సోమవారం బహూకరించారు. రామిరెడ్డికి సూపర్‌వైజర్ మరియకుమారి అంగన్‌వాడీ వర్కర్ కల్లి విజయలక్ష్మి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు, తల్లులు, గర్భిణులు, బాలింతలు పాల్గొన్నారు.

'బొల్లా' వాస్తవాలు తెలుసుకొని మాట్లాడాలి

● జనసేన పార్టీ సమన్వయకర్త నాగశ్రీను రాయల్

వినుకొండ, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): నూజెండ్ల మండలం, టి.అన్నవరం గ్రామంలో జరిగిన ఒక వ్యక్తిగత గొడవకు రాజకీయరంగు పులిమి కూటమి ప్రభుత్వంపై నిందలు వేస్తున్న బొల్లా బ్రహ్మనాయుడు వాస్తవాలు తెలుసుకొని మాట్లాడాలని వినుకొండ నియోజకవర్గ జనసేన పార్టీ సమన్వయకర్త కొంజేటి నాగశ్రీను రాయల్ హితవు పలికారు. పట్టణంలోని హనుమాన్‌నగర్‌లోని జనసేన పార్టీ ఆఫీసులో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఈ గొడవలో ఉన్న ఇద్దరు వ్యక్తులు వైసీపీకి చెందిన వారేనన్నారు. ఊరిలో జరిగే జాతరకు సంబంధించిన చందాల విషయంలో జరిగిన గొడవలో ఇద్దరు వ్యక్తులు గాయపడ్డారన్నారు. వారి వ్యక్తిగత వివాదాలను చీఫ్ విప్ జీవీ ఆంజనేయులు, మంత్రి లోకేశ్, కూటమి ప్రభుత్వంపైన వేయడం సిగ్గుచేటన్నారు. అభివృద్ధిని అడ్డుకోవాలని చూస్తే, చూస్తూ ఊరుకోమని హెచ్చరించారు. కార్యక్రమంలో జనసేన పార్టీ శావల్యాపురం మండల అధ్యక్షుడు అడపాల అనిల్ కుమార్, వినుకొండ మండల అధ్యక్షుడు గండికోట మణికంఠ, సీనియర్ నాయకుడు తుమ్మ అనిల్‌కుమార్, గణప రమేష్ పాల్గొన్నారు.

పిచ్చిమొక్కల తొలగింపునకు అంచనాలు సిద్ధం చేయండి

● ఎంపీడీవో సీతారామయ్య

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

శావల్యాపురం, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): ఉపాధి హామీ పథకం ద్వారా శావల్యాపురం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వెనుకనున్న ఖాళీ స్థలంలో దట్టంగా పెరిగిన పిచ్చి మొక్కలను తొలగించేందుకు అంచనాలు సిద్ధం చేయాలని ఎంపీడీవో పేరుమీన సీతారామయ్య ఉపాధి హామీ సిబ్బందికి సోమవారం ఆదేశాలు జారీ చేశారు. సోమవారం ఆంధ్రజ్యోతి దినపత్రికలో ప్రచురితమైన అధ్వానంగా పీహెచ్‌సీ పరిసరాలు అనే కథనానికి స్పందించిన మండల ప్రత్యేకాధికారి మూలె వెంకటరెడ్డి పిచ్చిమొక్కలు తొలగించేందుకు తక్షణ చర్యలు చేపట్టాలని ఎంపీడీవోని ఆదేశించారు. దీంతో ఎంపీడీవో పీహెచ్‌సీ పరిసరాలను పరిశీలించి వైద్య సిబ్బందితో మాట్లాడారు. గ్రామసర్పంచ్‌తో మాట్లాడి పీహెచ్‌సీకి ముందర పారిశుధ్య కార్యక్రమాలు చేయిస్తామన్నారు.

బాధ్యతగా విధులు నిర్వహిస్తాం : యార్డు చైర్మన్

చిలకలూరిపేట, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి) : పార్టీకి, ప్రభుత్వానికి మంచి పేరు వచ్చేలా బాధ్యతతో విధులు నిర్వహిస్తామని యార్డు చైర్మన్ షేక్ కరీముల్లా అన్నారు. సోమవారం ఆయన మాట్లాడుతూ చిలకలూరిపేటలో జరిగిన మార్కెట్ యార్డు నూతన కమిటీ పదవీ స్వీకార మహోత్సవాన్ని విజయవంతం చేసిన కూటమి శ్రేణులకు ఆయన ధన్యవాదాలు తెలిపారు.



ఆధునిక చేపల మార్కెట్‌కు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు తదితరులు

అభివృద్ధి పనులను వేగవంతం చేయాలి

● చేపల మార్కెట్‌కు శంకుస్థాపనలో ఎమ్మెల్యే ప్రత్తిపాటి

చిలకలూరిపేట, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): అభివృద్ధి పనులను అధికారులు వేగవంతం చేయాలని, పట్టణాభివృద్ధికి అవసరమైన నిధులు అందించడంలో కూటమి ప్రభుత్వం ఉదారంగా వ్యవహరిస్తోందని ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు అన్నారు. పట్టణంలోని కూరగాయల మార్కెట్ పక్కన రూ.125 కోట్లతో నిర్మించనున్న నూతన ఆధునిక చేపల మార్కెట్, మాంసం మార్కెట్ల దుకాణ సముదాయానికి సోమవారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ప్రత్తిపాటి మాట్లాడుతూ మార్కెట్ నిర్మాణ పనులు 3 నెలల్లో పూర్తిచేయాలని, పనులకు సంబంధించిన ప్రగతిని ప్రతినెలా తనకు తెలియచేయాలని మున్సిపల్ డీఈ రహీంను ఆదేశించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ షేక్ రఫాని, మార్కెట్ యార్డ్ చైర్మన్ షేక్ కరీముల్లా, మునిసిపల్ కమిషనర్ పి.శ్రీహరి బాబు, కందుల రమణ, వార్డు కౌన్సిలర్ కె.లక్ష్మి తిరుమల పాల్గొన్నారు.

ఘన వ్యర్థాల నిర్వహణ సక్రమంగా చేపట్టాలి

● ఇన్‌చార్జి ఎంపీడీవో జాకీర్‌హుస్సేన్

యడ్లపాడు, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): ప్రతి గ్రామ పంచాయతీలో ఘన వ్యర్థాల నిర్వహణ సక్రమంగా జరిగేలా పంచాయతీ అధికారులు చర్యలు తీసుకోవాలని ఇన్‌చార్జి ఎంపీడీవో షేక్ జాకీర్‌హుస్సేన్ అన్నారు. సోమవారం మండల పరిషత్ కార్యాలయంలో ఐటీసీ, స్వచ్ఛంద సంస్థ అసిస్ట్‌ల సౌజన్యంతో ఘన, ద్రవ వ్యర్థాల నిర్వహణపై ఒకరోజు శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ వ్యర్థాల విభజన, వ్యర్థాల నుంచి సంపద తయారీపై దృష్టి పెట్టాలన్నారు. అనంతరం రిసోర్స్‌పర్సన్ సీహెచ్ బొల్లయ్య పవర్ పాయింట్ ప్రజంటేషన్ ద్వారా వ్యర్థాల సేకరణ, తడి పొడి వ్యర్థాల వేరు వంటి అంశాలపై అవగాహన కల్పించారు. అనంతరం ఘన వ్యర్థాల నిర్వహణను తెలియచేసే గోడపత్రిక, కరపత్రాలను ఆవిష్కరించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు, గ్రామ సచివాలయ సిబ్బంది, శానిటేషన్ కమిటీ నాయకులు, డ్వాక్రా మహిళలు, వెలుగు, ఎన్ఆర్ఈజీఎస్ సిబ్బంది, అసిస్ట్ ప్రతినిధులు అనిల్‌కుమార్, ఏసోబు, నజీర్, బాజి పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఇన్‌చార్జి ఎంపీడీవో జాకీర్‌హుస్సేన్

పూర్వ విద్యార్థుల ఆత్మీయ కలయిక

చిలకలూరిపేట, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): స్థానిక ఆర్‌వీఎస్‌సీవీఎస్ హైస్కూలులో 1963 నుంచి 1970వరకు చదివిన పూర్వ విద్యార్థులు సోమవారం తాము విద్యనభ్యసించిన హైస్కూలు ప్రాంగణంలో ఆత్మీయ సమావేశం నిర్వహించారు. రాష్ట్ర ఐఎంఏ బాధ్యులు డాక్టర్ ఎన్.కిషోర్, దేవిరెడ్డి రామకోటేశ్వరరావుల ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో వారు మాట్లాడుతూ అప్పట్లో చదివిన 80మందిలో పది మంది డాక్టర్లు అయ్యారన్నారు. డాక్టర్ ఆంధ్ర కుమారి, డాక్టర్ రవి కుమార్ వంటి పలువురు ఆర్‌వీఎస్ హైస్కూల్ విద్యార్థులేనన్నారు. చిలకలూరిపేటలో డాక్టర్ లావు అంకమ్మ చౌదరి కుమారుడైన పూర్వ విద్యార్థి డాక్టర్ లావు నరేంద్రకు ఇటీవల పద్మశ్రీ అవార్డు లభించటంపై ఘనంగా సత్కరించారు. తమకు పాఠాలు చెప్పిన ఎంఎస్‌టీ సాయి, పీవీ సుబ్రహ్మణ్యం, పి.పట్టాభి రామారావులను ఘనంగా సత్కరించారు. చిలకలూరిపేట విద్యా సంఘం వారు విద్యాభివృద్ధికి చేస్తున్న కృషిని ప్రశంసించారు. సభలో సంఘం అధ్యక్షుడు తేళ్ల సుబ్బారావు, ఉపాధ్యక్షుడు డాక్టర్ కందిమళ్ళ సాంబశివరావు, కార్యదర్శి మైలవరపు శివానందకుమార్, జాయింట్ సెక్రటరీ బేతంచర్ల రామకోటేశ్వరరావు పాల్గొన్నారు.



చిలకలూరిపేటలో గురువులకు ఆత్మీయ సత్కారం చేస్తున్న పూర్వ విద్యార్థులు

రీ సర్వేను సమర్థవంతంగా నిర్వహించాలి : తహసీల్దార్

నూజెండ్ల, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): మండలంలో మూడో విడత నిర్వహిస్తున్న భూముల రీ సర్వే త్వరితగతిన పూర్తి చేయాలని తహసీల్దార్ రమేష్‌కుమార్ ఆదేశించారు. రెవెన్యూ కార్యాలయంలో సోమవారం వీఆర్‌వోల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ రెవెన్యూ సమస్యలను సత్వరమే పరిష్కరించాలన్నారు.

● రేషన్ డీలర్లు రేషన్ పంపిణీలో అక్రమాలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని తహసీల్దార్ జీ రమేష్ కుమార్ హెచ్చరించారు. సోమవారం రెవెన్యూ కార్యాలయంలో రేషన్ డీలర్ల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ 26వ తేదీ నుంచి 30వ తేదీ వరకు వృద్ధులకు ఇంటి ఇద్దకే రేషన్ పంపిణీ చేయాలన్నారు. సమయపాలన పాటించాలని, రేషన్ దుకాణాల్లో స్టాక్ బోర్డులను ఏర్పాటు చేయాలన్నారు. అదేవిధంగా ఎలక్ట్రానిక్ చెల్లింపులకు వీలుగా క్యూఆర్ కోడ్ ప్యానళ్ళు ఏర్పాటు చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ తులసీ, ఆర్ఐ సైదా తదితరులు పాల్గొన్నారు.

వంగవీటిని అవమానించిన వారిపై చర్యలు తీసుకోవాలి

● కాపు యువసేన రాష్ట్ర అధ్యక్షుడు శ్రీనివాసరావు

శావల్యాపురం, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): ఏలూరు జిల్లా కలిదిండి, సానారుద్రవరం గ్రామాల్లో వంగవీటి మోహనరంగా విగ్రహాలకు పేడపూసి అవమానించిన వారిని పోలీసులు అరెస్టు చేసి వారిపై కఠినమైన చర్యలు తీసుకోవాలని కాపు యువసేన రాష్ట్ర అధ్యక్షుడు కర్జా శ్రీనివాసరావు డిమాండ్ చేశారు. శావల్యాపురంలో సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ సమాజంలో ప్రజలమధ్య విద్వేషాలను రెచ్చగొట్టి గొడవలు సృష్టించేందుకు ప్రయత్నించేవారిని కఠినంగా శిక్షించాలన్నారు. భవిష్యత్తులో ఇటువంటి ఘటనలు పునరావృతం కాకుండా చూడాలన్నారు.

పేదలకు భూములు పంచాలి : డాక్టర్ గోదా జాన్‌పాల్

బొల్లాపల్లి, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మాల మహానాడు నియోజక వర్గ, బొల్లాపల్లి మండల మాల మహానాడు కమిటీలు మండలంలో సెంటు భూమి లేని పేద ఎస్సీ, ఎస్టీలకు భూములు పంచాలని మాల మహానాడు రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ గోదా జాన్‌పాల్ కోరారు. సోమవారం తహసీల్దార్ ఏ సుధాకర్‌కు వినతి పత్రం అందించారు. కార్యక్రమంలో కీర్తిపాటి వెంకటేశ్వర్లు, పిట్టల గోవిందు, కీర్తిపాటి గోవిందరాజులు, కొండు కరుణాకర్, భూదాటి సోసోను తదితరులు పాల్గొన్నారు.